ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 21.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 301 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ముంబయిని చిత్తు చేసిన ఢిల్లీ 12

సిట్ ఎదుట ముగిసిన హరీశ్‌రావు విచారణ

ఏడు గంటల పాటు సిట్ అధికారుల ప్రశ్నల వర్షం



- న్యాయవాదులను అనుమతించని పోలీసులు
- జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తం
- విచారణ అనంతరం తెలంగాణ భవన్ వెళ్లిన హరీష్
- కేటీఆర్, ఇతర ముఖ్య నేతలతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్ జనవరి 20: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కీలక నేత హరీష్‌రావు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ అధికారులు దాదాపు ఏడుగంటలకుపైగా ఆయనను విచారించారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారణ కొనసాగింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని శనివారం సాయంత్రం సిట్ అధికారులు హరీష్‌రావుకు నోటీసులు పంపించడంతో ఆయన

...:: మిగతా 2లో

సిట్ నోటీసులు నిరాధారమైనవి

- రాజకీయ దురుద్దేశంతోనే విచారణ
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- కేసులు, నోటీసులు భయపెట్టలేవు
- విచారణలో అడిగిందే మళ్లీ మళ్లీ అడిగారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

...:: 2లో



ఏఐతో మెరుగైన పౌర సేవలు

> రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వ్యవస్థలోని మేధస్సే ఒకవైపు సమస్యగా, మరోవైపు పరిష్కారంగా మారుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. డబ్ల్యూఈఎఫ్ ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

ఇప్పటిక అనేక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలు

- ఏఐని సరిగా వినియోగిస్తే మరింత సమర్థవంతంగా పాలన
- గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రం హైదరాబాద్
- రాష్ట్రంలో అన్ని అగ్రశ్రేణి కంపెనీల కార్యకలాపాలు
- ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం
- తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి
- హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుపై యూనిలీవర్ పరిశీలన
- హైదరాబాద్‌లో 'రాయల్ ఫిలిప్స్' నాలెడ్జ్ హబ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగించి తెలంగాణలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కంపెటిటివ్ నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వ్యవస్థలోని మేధస్సే ఒకవైపు సమస్యగా, మరోవైపు పరిష్కారంగా మారుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. ఏఐ యుగంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండలేవని, ముందస్తు చర్యలు తీసుకోవడం, వేగంగా నిర్ణయాలు అమలు చేయడమే కీలకమని ఏఐ ప్రభావం గురించి మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ముఖ్యమంత్రి వివరిస్తూ.. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా మారిందని, అన్ని రంగాలకు చెందిన అగ్రశ్రేణి కంపెనీలు తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా ఉండాలంటే మేధోవంతమైన వ్యవస్థలను నిర్మించాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

...:: మిగతా 2లో



జవాబుదారీ తనం ఎక్కడ?

ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలో నీటిగుంతలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యువరాజ్ మెహతా మరణించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు.

11



దావోస్‌లో ట్రంప్ విందు..

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరేళ్ల తర్వాత వస్తున్నారు. ఈ సందర్భంగా ట్రంప్ ఏర్పాటు చేసే విందుకు ఏడుగురు భారతీయ సీఈవోలకు ఆహ్వానం అందినట్లు సమాచారం.

11

రేవంత్‌ది నోట్ల కట్టలతో దొరికిన చరిత్ర



- ఆ బురదనే అందరికీ అంటించాలని చూస్తున్నారు
- బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీష్ కు నోటీసులు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తమ పోరాటం ఆగదు
- బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్‌కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఓటుకు నోటు కేసులో డబ్బుల కట్టలతో దొరికిన నేరచరిత్ర ఉందని, ఆ బురదనే అందరికీ అంటించాలని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్‌కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు గౌరవం ఇచ్చి బాధ్యతాయుతమైన నాయకుడిగా హరీష్‌రావు విచారణకు

...:: మిగతా 2లో



'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కండి

- రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకోండి
- పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు పుష్కలం
- పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం
- 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

...:: మిగతా 2లో



గ్రీన్‌లాండ్‌పై అమెరికా గురి

గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

11



వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దు

- చాలాన్లు చెల్లించాలంటూ వేధించడం చట్ట విరుద్ధం
- కీ తీసుకోవద్దు, బైక్‌లు లాక్కోవద్దు
- ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: పెండింగ్ చలాన్ల విషయంలో వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దని ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చలాన్లు చెల్లించాలని బైక్ కీస్ లాక్కోవడం, రోడ్డు మీదనే వాహనాన్ని ఆపేయడం లాంటి పనులు చేయొద్దని తెలిపింది. వాహనం ఆపినప్పుడు వాహనదారులు స్వచ్ఛందంగా చలాన్లు చెల్లిస్తే పోలీసులు వసూలు

...:: మిగతా 2లో

పురపోరుకు 'సిద్ధం'

- ఆశావహుల వ్యూహాలు
- ఇప్పటి నుంచే మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం
- కాలనీలలో పార్టీల నేతల చక్కర్లు
- ఆశీర్వాదం ఉండాలంటూ ఓటర్లను వేడుకోలు
- పలు మున్సిపాలిటీలలోని వార్డుల్లో ఉచిత సేవలకు శ్రీకారం
- ముఖ్యనేతల సమావేశాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ బిజీబిజీ

మాణిక్య ప్రభు గుర్రంపల్లి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: పుర పాలక సంఘాల రిజర్వేషన్లు తేలడంతో ఆశావహుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఇప్పటికే కొందరు వార్డుల బాట పట్టారు. ఏ వార్డు అయితే మేలని కొంతమంది అంతర్మథనంలో పడ్డారు. ఓటర్లు తమకు అనువుగా ఉన్నారా లేదా అన్న వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. రిజర్వేషన్ల ప్రక్రియకు ముందు ఫలానా వార్డు రిజర్వేషన్ అనుకూలిస్తే తప్పకుండా పోటీ చేయాలని భావించారు. అవి కాస్తా మారిపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. తానొకటి తలస్తే దైవమొకటి తలచారని భావిస్తున్న వారు అధికారాన్ని చేజిక్కించుకునేందుకు

...:: మిగతా 2లో



ఓ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల సమావేశం



నితిన్ నబిన్ నాకు బాస్..

నేను పార్టీ కార్యకర్తని: ప్రధాని మోదీ

- కొత్త జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ బాధ్యతలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి20 : భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడి గా నితిన్ నబిన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనపై ప్రశంసలు కురిపించారు. నబిన్ పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే మలీనియల్ అని

...:: మిగతా 2లో



అబూ సలేంకు షాక్..

అబూసలేంపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. తన సోదరుడి మరణం నేపథ్యంలో 14 రోజుల పెరోల్ కోరుతూ బాంబే హైకోర్టులో అబూ సలేం పిటిషన్ వేశాడు. దానిని వ్యతిరేకిస్తూ మహా ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

11

రాష్ట్రీయం

‘తెలంగాణ రైజింగ్’లో భాగస్వామ్యం కండి

మొదటిపేజీ తరువాయి

దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకునేందుకు ముందుకు రావాలని వారిని సాదరంగా ఆహ్వానించారు. మంగళవారం వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో భాగంగా దావోస్ లో ఏర్పాటు చేసిన "ఇండియా పెవిలియన్" ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికా బద్ధమైన అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేశామన్నారు. ఈ విజన్ డాక్యుమెంట్ లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కీలక రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, హెల్త్ కేర్ ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, హార్డ్ వేర్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఐటీఈఎస్, ఏరో స్పేస్, డిఫెన్స్, టెక్స్ టైల్, అప్పారెల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్, రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీస్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలు, అవకాశాలు, ఇక్కడి ఎకో సిస్టం గురించి వివరించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దావోస్ వేదికగా తమ ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పారిశ్రామికాభివృద్ధికి ఉత్తమిచ్చేలా రూపొందించిన పాలసీలను వివరించి, దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. "తెలంగాణ బ్రాండ్" మరింత విశ్వ వ్యాప్తం అయ్యేలా లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్(టీఏఐహెచ్) ను దావోస్ వేదికగా లాంఛనంగా ఆవిష్కరిస్తామన్నారు.

వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దు

మొదటిపేజీ తరువాయి

చేసుకోవచ్చని న్యాయస్థానం స్పష్టంగా పేర్కొంది. వాహనదారులు చలాన్ చెల్లించడానికి ఇష్టపడని పక్షంలో చట్ట ప్రకారం కోర్టు నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా వాహనాలపై ఉన్న ఈ చలాన్లు వసూలు చేస్తున్నారని హైకోర్టులో ఓ న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను రోడ్డు మీదనే ఇబ్బంది పెడుతున్నారని, బలవంతంగా చలాన్లు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులకు కోర్టు అలా చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది.

రేవంత్‌ది నోట్ల కట్టలతో దొరికిన చరిత్ర

మొదటిపేజీ తరువాయి

హాజరయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అధికారం దక్కినా రేవంత్ రెడ్డి బుద్ధి మాత్రం మారలేదని, అడ్డగోలు సిట్ విచారణలతో ఎన్ని తమాషాలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఇప్పటివరకు ఏ అధికారి అధికారికంగా మాట్లాడలేదని, కేవలం లీకులతోనే కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. గతంలో హరీష్ రావుపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టు కొట్టివేసినా, కుట్రపూరితంగా ప్రజల సొమ్ముతో ఆయనపై రాష్ట్ర ప్రభుత్వం కోర్టుల్లో వాదిస్తోందని ఆరోపించారు. బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందువల్లనే కక్షతో హరీష్‌రావుకు నోటీసులు ఇచ్చారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా సింగరేణిలో టెండర్ల రిగ్గింగ్ జరుగుతోందని, సుమారు తొమ్మిది టెండర్లను ముఖ్యమంత్రి కుటుంబమే నియంత్రిస్తోందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే నిబంధన తెచ్చి, కంపెనీలను బెదిరిస్తున్నారని, సృజన్ రెడ్డి స్వయంగా ఈ దందా నడిపిస్తున్నారని ఆరోపించారు. భట్టి విక్రమార్క రద్దు చేశామంటున్న నైనీ కోల్ బ్లాక్స్ వెనుక కూడా ఇదే అక్రమ దందా ఉందని, ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ దోపిడీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని, ఇందులో బీజేపీకి కూడా వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు, రేషన్ బియ్యం స్కాం, లగచర్ల, మూసీ వంటి అంశాలపై తాము సాక్ష్యాధారాలు చూపినప్పుడల్లా ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇటువంటి నోటీసులు ఇస్తోందని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ఎనిమిది మంది మంత్రులను ధైర్యంగా ఎదుర్కొన్న హరీష్ రావుకు నలుగురు పోలీసుల విచారణ పెద్ద లెక్క కాదన్నారు. చట్టం, రాజ్యాంగంపై ఈ ప్రభుత్వానికి గౌరవం లేదని, ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడేది లేదని స్పష్టం చేశారు. పొంగులేటి కొడుకు భూకబ్జా యత్నంపై, సీఎం అనుచరుల తుపాకీ బెదిరింపులపై ఎందుకు సిట్ వేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ జర్నలిస్టులపై వేధింపులు ఆపాలని, కేవలం లీకులతో వార్తలు రాపించుకుంటే నిజాలు దాగవని హితవు పలికారు.రేవంత్ రెడ్డి రాజకీయ క్రీడలో పోలీసులు బలి కావద్దని, అక్రమ కేసులు పెడుతున్న అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు. మరో రెండేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తామన్నారు. రేవంత్ రెడ్డి హార్వర్డ్ పర్యటనపై స్పందిస్తూ, అక్కడ కూడా తన అసభ్యకర భాషను వాడుతారా అని ఎద్దేవా చేశారు. ఇంగ్లీష్ రాదని చెప్పే రేవంత్ రెడ్డి అక్కడ ఏం నేర్చుకుంటారో చూడాలన్నారు. తమ పార్టీ జెండా గద్దెలను ముట్టుకుంటే కాంగ్రెస్ గద్దెలు పోవడం ఖాయమని, తమ కార్యకర్తలు దాడులను సహించరని హెచ్చరించారు. గత పదేళ్లలో తాము ఎప్పుడూ పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేయలేదని, రేవంత్ రెడ్డి కూడా ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

పురపోరుకు ‘సిద్ధం’

మొదటిపేజీ తరువాయి

వ్యూహాలు రచిస్తున్నారు. కొన్నిచోట్ల పతుల స్థానం రాకపోయే సరికి సతులను నిలబెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మొదలైన అభ్యర్థుల వేట

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లు ఖరారు కావడంతో ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల వేట మొదలైంది. గెలుపు గుర్రాలపై నాయకులు దృష్టి సారించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకుని గెలుపు వీరులకు టికెట్ ఇవ్వాలని నేతలు భావిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు పార్టీలో అభిప్రాయ సేకరణ ముఖ్యమని ఆలోచన చేస్తున్నారు. కొందరు నేతలు వార్డుల వారీగా సమావేశాల్లో తలమునకలయ్యారు. కొన్ని మున్సిపాలిటీలలో ఆశావహులు ఓటర్లకు ఇప్పటి నుంచే ఉచిత సేవలకు శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీలో ఓ వార్డులో పోటీకి సై అంటున్న ఇద్దరు నేతలు ఉచిత మంచినీటిని సరఫరా చేస్తున్నారు. మరో నేత ఏకంగా ఫిల్టర్ వాటర్ ను ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. ఓటర్లు వద్దు అన్నా కూడా ఫిల్టర్‌వాటర్‌వాటిల్‌ఇంటిలో వేసి వెళ్తుండడం గమనార్హం. ఇలా పలు మున్సిపాలిటీలలో ఆశావహులు ఓటర్ల ను ప్రసన్నం చేసుకునేందుకు ఉచిత సేవలకు మొదలెట్టారు.

రిజర్వేషన్లతో తలలు పట్టుకుంటున్న నేతలు

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తానే చైర్మన్ అంటూ, ఫలానా వార్డులో పోటీ చేసేందుకు అధికార పార్టీలోని ముఖ్యనేతలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తీరా రిజర్వేషన్ల ఖరారు అనుకూలించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ఫలానా వార్డు నుంచి పోటీ చేస్తానన్న నేతలు రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో వేరే వార్డు వెతుక్కుంటున్నారు. రిజర్వేషన్ల ప్రకటనతో పలువురి నేతల రాతలు తారుమారయ్యాయి. చైర్మన్ నేనే అనుకున్న నేతలకు చైర్మన్ పదవి సైతం రిజర్వేషన్ల మారిపోవడంతో ఇప్పుడు తలలు పట్టుకోవడం వారి వంతైంది.

పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ...


గత రెండు సంవత్సరాల వ్యవధిలో తాము చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. పదకాలంతో పాటు పట్టణాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సిద్ధం అవుతోంది. పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రత్యేక దృష్టిసారించింది. ముఖ్యనేతల సమావేశాలు జోరుగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు ముఖ్యనేతల సమావేశాలు నిర్వహిస్తూ ఎలాగైనా మున్సిపాలిటీలో పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు నేతలు కలిసికట్టుగా అభ్యర్థులను గెలిపించుకోవాలంటూ వివరిస్తున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసిన కార్యకర్తలకు పార్టీ గుర్తింపుందని వారు నూరిపోస్తున్నారు. ఇప్పటికే లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా మంత్రులను ఇంఛార్జులుగా పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి నియమించారు. ఇంఛార్జ్ మంత్రి చైర్మన్‌గా లోక్‌సభ స్థానం పరిధిలోని డీసీసీ అధ్యక్షులు కన్వీనర్లుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, లోక్‌సభకు పోటీ చేసిన నేతలు, సీనియర్ నాయకులతో స్క్రీనింగ్ కమిటీ వేస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికతో పాటు అభ్యర్థి గెలుపు వ్యూహరచనపైనా స్క్రీనింగ్ కమిటీలు కీలకంగా పని చేయనున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ సైతం...

మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. గెలుపు వీరుల కోసం ఆ పార్టీ జాబితాను రెడీ చేస్తున్నది. ముఖ్యంగా గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్న విషయాన్ని పట్టణ ఓటర్లలోకి తీసుకెళ్లి విజయం సాధించాలని భావిస్తోంది. ఏదీ ఏమైనప్పటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ లో ఆశావహులు అధికంగా ఉండడంతో ఇప్పటి నుంచే బుజ్జగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

స్థానిక ఎన్నికలతో కమలం పార్టీకి ఊపిరి

బిజేపీ సైతం ఈ ఎన్నికల్లో విజయావకాశాలపై అంచనాలు వేస్తోంది. స్థానిక ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు అభ్యర్థులు గెలవడంతో ఆ పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లు అయింది. ఇప్పుడు ఈ ఎన్నికల్లోనూ పాగా వేయాలని క్షేత్రస్థాయిలో అడుగులు వేస్తోంది కమలం పార్టీ. అయితే పలు మున్సిపాలిటీలలో వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను సైతం ఆ పార్టీ ఆహ్వానించడం గమనార్హం.



‘రక్షణ, ఏరోస్పేస్, యూఏవీ పర్యావరణ వ్యవస్థలు, డీశాలినేషన్, సెమీకండక్టర్, క్వాంటం లీడర్‌షిప్, వైద్యం, విద్య, సైబర్ సెక్యూరిటీలో అవకాశాలపై చర్చించాం. మెడ్-టెక్, ఏరో-డిఫెన్స్, క్లీన్-టెక్ కంపెనీలకు ఆతిథ్యమివ్వడానికి రాష్ట్రంలో ఇండస్ట్రియల్ పార్క్ పెట్టాలని ఇజ్రాయెల్ ఆర్థిక, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్‌తో ప్రతిపాదించాను’.
- దావోస్‌లో
ఏపీ సీఎం చంద్రబాబు

ఏఐతో మెరుగైన పౌర సేవలు

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఈ సదస్సులో స్మార్ట్ ఫ్యాక్టరీలు, స్థిరమైన ఇంధన వ్యవస్థలు, ఏఐ ఆధారిత సేవలు, స్మార్ట్ సిటీల నిర్మాణంపై ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య మంత్రి హస్సన్ ఎల్కహతీబ్, ఎమరాల్డ్ ఏఐ సీఈఓ వరుణ్ శివరామ్, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (విప్రో) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జర్మనీ డిజిటల్ మంత్రిత్వ శాఖ మంత్రి కార్ స్టెన్ వైల్డ్ బెర్గర్, నోకియా సీఈఓ జస్టిన్ హోటార్డ్, హిటాచి సీఈఓ తోషియాకి టోకునాగా సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యానికి సౌదీ సంస్థ ఆసక్తి

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ ‘ఎక్స్ పర్టైజ్’ స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్ , సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2047 విజన్‌కు అనుగుణంగా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రాథమిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, శిక్షణ, మెంటార్‌షిప్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారతదేశంలో పూర్తిగా పరిశ్రమల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తొలి విశ్వవిద్యాలయం స్కిల్ యూనివర్సిటీయేనని ఆయన పేర్కొన్నారు.ఎక్స్ పర్టైజ్ సంస్థ సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా సుమారు 5వేల మంది నైపుణ్య కలిగిన సిబ్బందిని నియమించుకునే అవసరం తమకు ఉందని, ఆ అవసరాలను తీర్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసుకోవాలని ప్రతిపాదించారు. అవసరమైన అన్ని విభాగాల్లో శిక్షణను యూనివర్సిటీతో కలిసి ప్రారంభించాలనుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు..యూనిలీవర్ పరిశీలన

ప్రపంచవ్యాప్తంగా వస్తువినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా మంగళవారం దావోస్‌లో, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ప్రతినిధి బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్తో సమావేశమైంది. తెలంగాణలో జీసీసీ ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా హైదరాబాద్ వేగంగా మారుతుందని వివరించారు. దీనిపై స్పందించిన విల్లెమ్ ఉయిజెన్ హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు అవకాశాలను తమ సంస్థ సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్, కాస్టకో వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ (త్వరగా వినియోగ వస్తువుల) సంస్థల జీసీసీలు విజయవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు యూనిలీవర్ విలువైన భాగస్వామి అని, వేగవంతమైన అనుమతులు, లైసెన్సింగ్ ప్రక్రియలతో తెలంగాణ వ్యాపారాలకు అనుకూల రాష్ట్రంగా నిలుస్తోంది అని మంత్రి పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ‘తెలంగాణ రైజింగ్’ ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్- స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ‘తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030’ గురించి ప్రతినిధి బృందం వివరించింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ (ORR) , రీజినల్ రింగ్ రోడ్) మధ్యనున్న ప్రాంతంలో పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ, తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటీ-లైఫ్ సైన్సెస్-హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌ల లో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ఫ్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణాకు పూర్తి మద్దతు: సంజయ్ గుప్తా

గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లు మరియు వాతావరణ మార్పు అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని తెలిపారు. సీఎంతో పాటు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, బీఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలాతో భాగస్వామ్యం, ఏఐ పాఠ్యాంశాల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీ ఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నితిన్ నబిన్ నాకు బాస్..

నేను పార్టీ కార్యకర్తని: ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

అభివర్ణించారు. పార్టీ పరంగా నబిన్ తనకు బాస్ అని.. తాను మాత్రం పార్టీ కార్యకర్తనే అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఇచ్చిన బాధ్యతలను నబిన్ విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు. భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ పేరును ఆ పార్టీ ఇవాళ అధికారికంగా ప్రకటించింది. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో.. రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ చేతుల మీదుగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సర్టిఫికేట్‌ను నితిన్ అందుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్త అధ్యక్షుడిగా నితిన్ బాధ్యతలు స్వీకరించారు.

సిట్ నోటీసులు నిరాధారమైనవి

- రాజకీయ దురుద్దేశంతోనే విచారణ
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- కేసులు, నోటీసులు భయపెట్టలేవు
- విచారణలో అడిగిందే మళ్లీ మళ్లీ అడిగారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: రేవంత్ రెడ్డి ఇచ్చిన సిట్ నోటీసులు నిరాధారమైనవని, రాజకీయ దురుద్దేశంతోనే విచారణ చేపట్టారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ ఆరోపించారు. దమ్ముంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పోలీసుల వెనుక దాక్కుని నోటీసులు పంపడం కాదని, రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. కేసులు, నోటీసులు తమను భయపెట్టలేవని, రాష్ట్ర ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సిట్ విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు సిట్ నోటీసులను తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన సిట్ నోటీసులు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ కక్షతోనే ఈ విచారణ చేపట్టారని ఆరోపించారు. తనకు నైతిక మద్దతు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలిపారు. సిట్ విచారణలో అడిగిందే తిరిగి తిరిగి అడిగారని, కొత్తగా ఏమీ లేదని అన్నారు. అధికారులకు ప్రశ్నలు వేస్తే బయట నుంచి ఫోన్లు వచ్చి మళ్లీ అదే ప్రశ్నలు అడిగారని పేర్కొన్నారు. అన్ని ఆధారాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, సింగరేణి కుంభకోణంపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. టెండర్లు, స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ సిట్ విచారణలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమాలు, పోరాటాలు, అరెస్టులు తమకు కొత్త కాదని, కేసీఆర్ నాయకత్వంలో వందల కేసులు ఎదుర్కొని తెలంగాణ సాధించామని గుర్తు చేశారు. నోటీసులు తమ ప్రజాపోరాటానికి ఇచ్చిన గౌరవంగానే భావిస్తానని అన్నారు. రైతు బంధు, రుణమాఫీ, ఉద్యోగాలు, పెన్షన్లపై ప్రభుత్వం మాట్లాడాలని, ప్రజా సమస్యలను పక్కన పెట్టి అక్రమ కేసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పోలీసుల వెనుక దాక్కొని నోటీసులు ఇవ్వడం కాకుండా రాజకీయంగా ఎదుర్కోవాలని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు.

చట్టాన్ని గౌరవిస్తా..అందుకే వచ్చా

సిట్ విచారణకు బయల్దేరేముందు కోకాపేట నివాసం వద్ద హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం పొద్దున బయట పెడితే సాయంత్రం నోటీసు ఇచ్చారు. చట్టాన్ని గౌరవించి నేను రాత్రి సిద్దిపేట నుంచి వచ్చి నేడు సిట్ విచారణకు వెళ్తున్నాను. రేవంతు రెడ్డి తాటాకు చప్పుళ్లకు నేను బయట పడను. నిన్న బొగ్గు స్కాం బయట పెడితే ఒక్క మంత్రి, ఒక్క కాంగ్రెస్ నాయకుడు మాట్లాడలేదు. దండుపాళ్యం ముటా వాటాలు పంచుకోవడంలో ఎలా తన్నుకుంటున్నారో బయట పెట్టానని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల ముందు అవినీతి బండారం బయట పడితే నష్టం జరుగుతందని రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టాడని అన్నారు.తెలంగాణ ఉద్యమకారులం, కేసీఆర్ తయారు చేసిన సైనికులం రేవంత్ రెడ్డి పిట్ట బెదిరింపులకు బయటపడం. ‘హిల్ టీపీ, పవర్ స్కాం, భూ కుంభకోణాలు బయట పెట్టినం. నీ వాటాల విషయం ప్రజలకు అర్థమైందని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నవు. కృష్ణా, గోదావరి నీళ్లను ఏపీకి అప్పనంగా కట్టబెడుతూ తెలంగాణకు ద్రోహం చేస్తుంటే చూస్తూ ఊరుకోక నీ బండారం బయట పెట్టినం’ అని అన్నారు. ‘నువ్వు ఎన్ని డైవర్షన్లు చేసినా నీ బొగ్గు స్కాం, పవర్ స్కాం, హిల్ టీపీ స్కాం బయట పెడుతం. ఆంధ్రాకు అమ్ముడు పోయిన దానిపై నిలదీస్తూనే ఉంటం. బొగ్గు స్కాంపై నేను కిషన్ రెడ్డికి లేఖ రాస్తున్నా. కాంగ్రెస్, బిజేపీ కుమ్మక్కు అయ్యింది నిజం కాకుంటే సీబీఐ విచారణ వేయాలని డిమాండ్ చేస్తున్నాం. రేవంత్‌రెడ్డి, తన బామ్మర్దితో కలిసి చేస్తున్న స్కాం ఎలా జరిగిందో విచారణ జరపాలి. నైనీ బ్లాక్ ఒక్కటే కాదు, అన్ని టెండర్లు రద్దు చేయాలి. సీబీఐ విచారణ జరపాలి. వెంటనే బిజేపీ స్పందించాలి. దొంగలను అరెస్టు చేయాలని, అవినీతి సొమ్మును కక్కించాలని డిమాండ్ చేస్తున్నాం.’ అని అన్నారు.

ముగిసిన హరీశ్‌రావు విచారణ

మొదటిపేజీ తరువాయి

మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అప్పటి నుంచి సాయంత్రం 6.30 గంటలకు వరకు అధికారులు ఆయనను ప్రశ్నించారు. సిట్ అధికారులైన ఏసీపీ వెంకటగిరి, ఎస్పీ రవీందర్‌రెడ్డి ఆయనను విచారించారు. కాగా ఈ సందర్భంగా న్యాయవాదులను లోపలికి అనుమతించలేదు. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. దాంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకుని ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ తెలంగాణ భవన్ నుంచి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరి రావడం తో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ పాత్రపై ఆరుగురు సభ్యుల బృందం విచారించింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరగంట పాటు లంచ్ బ్రేక్ ఇచ్చారు. తర్వాత మళ్లీ ఎంక్వైరీ కంటిన్యూ చేశారు. విచారణ తర్వాత హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి హరీశ్ రావు నేరుగా తెలంగాణ భవన్ కు వెళ్లారు. కేటీఆర్, ఇతర ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు.

సినిమా టికెట్ ధరల పెంపు

ఉత్తర్వులు 90 రోజుల ముందే ఇవ్వండి

- రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైరాబాద్, జనవరి 20: సినిమా టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను 90 రోజుల ముందే ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను సవాల్ చేసిన న్యాయవాది విజయ్ గోపాల్ 'రాజాసాబ్' చిత్రం టికెట్ ధరలపై ఈ నెల 9న హైకోర్టులో వాదనలు వినిపించారు. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రానికి టికెట్ ధరలు పెంచుతూ ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను కోర్టు దృష్టికి జీపీ తీసుకురాలేదని విజయ్ గోపాల్ అన్నారు. ఇకపై టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను చిత్ర విడుదలకు 90 రోజుల ముందు జారీ చేయాలని హోంశాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

తదుపరి విచారణ వాయిదా

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. కోర్టు ధిక్కరణ కింద హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ అయ్యాయి. 'మన శంకరవర ప్రసాద్ గారు' చిత్రానికి టికెట్ ధరల పెంపు విషయంలో నోటీసులు జారీ అయ్యాయి. కౌంటర్ దాఖలు చేయాలని జీపీని ఆదేశిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది. 'మన శంకరవ రప్రసాద్ గారు' సినిమా ప్రీమియర్స్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పెషల్ షోతో పాటుగా టికెట్ రేటు పెంపునకు కూడా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా మెమో జారీ చేసింది. ఈ సినిమా జనవరి 12న గ్రాండ్‌గా రిలీజ్ అయింది. దీనికి ఒకరోజు ముందు, జనవరి 11 రాత్రి ప్రీమియర్ షో ఇచ్చింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ షో టికెట్ ధరను రూ.600 (జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించింది. ఇక జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు టికెట్ రేట్లు పెంచుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. ఈ సమయంలో సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర అదనంగా ఉంటుంది.

టికెట్ల ధరల పెంపు కోసం నా వద్దకు రావొద్దు

సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశానని గతంలో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. "పుష్ప" సినిమా తర్వాత బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని గతంలోనే పేర్కొన్నట్లు గుర్తు చేశారు. ఈ విషయంలో తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. టికెట్ల పెంపు విషయమై తన వద్దకు ఎవరూ రావద్దని అన్నారు. ఇటీవల సినిమా టిక్కెట్లు ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదని వెల్లడించారు. ఈ విషయంలో తనను ఎవరూ సంప్రదించలేదని తెలిపారు. తాను ఏ ఫైల్ పైనా సంతకం పెట్టలేదని స్పష్టత ఇచ్చారు. గతంలో పుష్ప సినిమా సమయంలో మహిళ చనిపోతే ఎవరూ ముందుకు రాకపోతే తానే రూ.25 లక్షలు సాయం అందించానని తెలిపారు. ఆ సినిమా నిర్మాత కూడా సాయం చేయలేదని తెలిపారు. ఆ బాధిత అబ్బాయిని ఆదుకుంటాను, చదివిస్తాను అని తండ్రికి కూడా చెప్పానని ప్రస్తావించారు. సినిమా బెనిఫిట్ షోలు, టికెట్ల ధరల పెంపు కోసం తన వద్దకు ఎవరూ రావద్దని కూడా చెప్పానని మంత్రి కోమటిరెడ్డి హైదరాబాద్ మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు నిధుల విడుదల

- ఒకే రోజు 23 వేల మందికి రూ.262.51 కోట్ల చెల్లింపులు
- ఆధార్ ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో సొంత ఇంటిని నిర్మించుకుంటున్న సుమారు 23 వేల మంది లబ్ధిదారులకు రూ. 262.51 కోట్లను విడుదల చేశారు. ఈ మొత్తాన్ని ఆధార్ నెంబరు ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం తెలిపారు. ఈ వారం చేసిన చెల్లింపుల్లో, బేస్ మెంట్ స్థాయి నిర్మాణపు పనులను పూర్తి చేసిన లబ్ధిదారులు 2763 ఉండగా, గోడలు శ్లాబ్ కట్టడాల స్థాయి దాటిన వారు 20,186 ఉన్నారని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రతి బిల్లులను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది మార్చి నాటికల్లా ఒక లక్ష ఇండ్లను పూర్తి చేయడంతోపాటు, తదుపరి దశను ప్రారంభించడానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులు జోరుగా కొనసాగుతున్నాయని, మార్గదర్శకాలకు అనుగుణంగా (400-600 చదరపు అడుగుల విస్తీర్ణం మొదలైనవి) ఇండ్లు కట్టుకుంటున్న వారందరికీ బిల్లులు సకాలంలో విడుదల అవుతున్నాయన్నారు. పూర్తి పారదర్శకంగా, ఆన్‌లైన్‌లోనూ, క్షేత్ర స్థాయిలోనూ నిశిత పరిశీలన అనంతరమే బిల్లుల మొత్తం మంజూరవుతుందన్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 2.50 లక్షల ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో సుమారు 1.25 లక్షల ఇండ్లు గోడలు, శ్లాబ్ లు అయిపోయి త్వరలోనే పూర్తి కానున్నాయని మరో 75 వేల ఇండ్ల పనులు బేస్ మెంట్ స్థాయిని దాటిపోయాయని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ జిల్లాల్లో కలెక్టర్లు తరచు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారని, నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంతవరకు మొత్తం రూ. 4351 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని, బిల్లులను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మేనేజింగ్ డైరక్టర గౌతం వివరించారు.



కలెక్టర్ కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం!

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 20 : సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఒక డ్రైవర్ వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకునే ప్రయత్నం చేయగా కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది, పోలీసులు అడ్డుకుని ప్రాణాపాయం నుంచి కాపాడారు.. వ్యక్తి గుమ్మడిదల ఎటీఎంలో తన డబ్బులు దొంగిలించబడ్డాయని, పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోవడం లేదని బాధితుడు ఆరోపించాడు. న్యాయం జరగడం లేదంటూ ఈ చర్యకు పాల్పడ్డానని బాధితుడు తెలిపాడు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే స్పందించి అతడిని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.

యూత్ ఐడియాథాన్‌లో డీపీఎస్ వరంగల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 20: పెండ్యాల లోని డీపీఎస్ వరంగల్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు, ఆదివారం ఐఐటి ఢిల్లీలో, థింక్ స్టార్టప్, సీబీఎస్ఈ సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక యూత్ ఐడియాథాన్ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని పాఠశాల ఛైర్మన్ రవి కిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ వరంగల్ విద్యార్థులు మేధా పెండ్యాల, జోయా తహీ్మనా పాల్గొన్నారు. అధ్యాపకుడు కాసిపేట మనోజ్ రాజ్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో విద్యార్థులు, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'ఫామ్ లింక్' అనే యాప్‌ను అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత ఈయాప్ ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. రైతులు నేరుగా మార్కెట్లతో అనుసంధానం కావడం, సరైన ధరలు పొందడం వంటి అంశాల్లో ఈయాప్ కీలక పాత్ర పోషిస్తుందని విద్యార్థులు వివరించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. ఈ ఆలోచన దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, నిపుణుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగ అభివృద్ధికి వినియోగించే దిశగా ఈ ప్రాజెక్ట్ ఆదర్శంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ వి. రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.

నైని బ్లాక్ వివాదంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి

- సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది సమాన పాత్ర
- బీజేపీ చీఫ్‌రామచంద్రరావు మండిపాటు



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 20: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది సమాన పాత్ర ఉందంటూ ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సింగరేణిలోని నైని బ్లాక్ వివాదంపై సీబీఐ లేదంటే ఏదైనా సంస్థతో దర్యాప్తు జరపాలి. ఇది ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరిగిన గొడవల వలనే బయటకు వచ్చింది. మీడియాలో వచ్చిన తర్వాతే నైని బ్లాక్ టెండర్లు రద్దు చేశారు. అంతకు ముందు టెండర్లు ఎందుకు రద్దు చేయలేదో భట్టి బయట పెట్టాలి' అని ఆయన అన్నారు.

నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు

రామచంద్రరావు మాట్లాడుతూ.. 'నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్ పాత్ర ఉంది. రాష్ట్రమంతా నైని కోల్ బ్లాక్ గురించి మాట్లాడుతున్నారు. సింగరేణిలో ఎప్పుడూ కూడా రాష్ట్ర ప్రభుత్వం వాటా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి లాభాల్లో ఉంది. నైని కోల్ బ్లాక్ అంశంతో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు బయటపడ్డాయి. మంత్రులు బంధువులకు కోల్ బ్లాక్ కేటాయించే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డికి లేఖ రాసే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదు. బీఆర్ఎస్ సుద్ద పూసేమీ కాదు. నైని బ్లాక్‌లో ఎవరికి ఎంత ముట్టిందో చెప్పాలి. సింగరేణిలో కమిషన్ కింద కోట్లు సంపాదిస్తున్నారు' అని రామచంద్రరావు తెలిపారు.

మంత్రుల మధ్య తగాదాలు..

'కాంగ్రెస్ మంత్రుల మధ్య తగాదాలు అవుతున్నాయి. వారి వారి బంధువులకు కాంట్రాక్టులకు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఆస్తుల పంచాయతీ నడుస్తోంది. హరీష్ రావుకు ఒకటే చెప్తున్నా.. సుద్దపూస మాటలు మాట్లాడొద్దు. రాష్టానికి మొదట భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్.. దాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. స్టేట్ గవర్నమెంట్‌లో సిట్, ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నాయి. వాటితో కూడా విచారణ జరిపించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల అవినీతి, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై కూడా అవినీతి విచారణ జరగాలి' అని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం మొత్తం రూ .లక్ష 30 వేల కోట్లు ఖర్చు చేశారు . కాళేశ్వరం ఏటీఎంగా మారిందని మేము కూడా చెప్పాం. ఫోన్ ట్యాపింగ్ కేసు రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ కేసులో చాలా మంది అధికారులను అరెస్ట్ చేసినా.. రాజకీయ నాయకులను మాత్రం అరెస్ట్ చేయలేదు. ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మాత్రమే చేస్తున్నారు. హరీష్ రావును సిట్ ఎందుకు పిలవలేదు. వారి ప్రభుత్వంలోనే ఫోన్ ట్యాపింగ్ చేశారు. సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వమని బీఆర్ఎస్ గతంలో జీవో తెచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ఆ జీవోను ఇంకా ఎత్తివేయలేదు. ఈడీకి ఎలాంటి అనుమతి అవసరం లేదు.. వాళ్ళు విచారణ చేయొచ్చు' అని రామచంద్రరావు పేర్కొన్నారు.



'మేడారం'కు 4 వేల ప్రత్యేక బస్సులు

- జాతతరకు వెళ్లే మహిళలకు ప్రయాణం ఉచితం
- 20 లక్షల మంది ప్రయాణం చేస్తారని అంచనా
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 20 : మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 సెంటర్ల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.

50 శాతం అదనపు ఛార్జీలు

మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు 1800 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




'ఉపాధి' పథకం పేరు మార్పునకు నిరసనగా వీహెచ్ మౌనదీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగింపునకు నిరసనగా ఏఐసీసీ పీసీసీ ఆదేశాల మేరకు మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో బాపూఘాట్ గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి తారీక్‌అన్వర్ హాజరయ్యారు. మాజీ ఎంపీ హనుమంతరావు కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు అప్సర్ యూసఫ్, సాయి ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు ముత్తా రోహిత్, కార్వాన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఉస్మాన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సైఫుల్లా, లింజిస్టిక్ చైర్మన్ రాజేష్ అగర్వాల్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లయినా ఫోన్ ట్యాపింగ్ దోషులెవరో తేల్చలేదు

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై ఎంపీ లక్ష్మణ్ విమర్శలు



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 20 : ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ అయిందని తెలంగాణ మొత్తం కోడై కూస్తోందని ఎంపీ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కవిత కుటుంబ సభ్యుల ఫోన్లూ ట్యాప్ అయ్యాయని.. ఈ విషయమై కవితే స్వయంగా చెప్పారన్నారు. ముందు.. కవిత మాటలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోందని అనుమానాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు. వారి అంతర్గత కలహాలతో ఆయా నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. దర్యాప్తులతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న దోషులు, బాధ్యులు ఎవరో నిర్ధారించకుండా రెండేళ్లు పూర్తి చేశారంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్.. కలహాలతో ముక్కలైపోయిందని, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని లక్ష్మణ్ అన్నారు. కవిత ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోల్ బ్లాక్‌పై న్యాయపోరాటం కూడా చేసే అవకాశముందని చెప్పారు. బీఆర్ఎస్ తిన్న మొత్తాన్ని కక్కిస్తామని రేవంత్ రెడ్డి అన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ పూర్తి దర్యాప్తు చేయాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

హరీశ్‌రావుకు నోటీసులు కుట్రపూరితం

- బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సిట్ నోటీసులు
- అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదు
- మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే బీఆర్ఎస్ ఉపనేత హరీష్‌రావుకు కుట్రపూరితంగా సిట్ నోటీసులు జారీ చేశారని మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. పోలీస్ వ్యవస్థను అడ్డంపెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. హరీష్‌రావు లేవనెత్తిన బొగ్గు టెండర్ అవినీతిపై ప్రభుత్వం సమాధానం చెప్పలేక నోటీసుల డ్రామాకు తెరలేపిందని తెలిపారు. నైని బొగ్గు టెండర్‌తో పాటు సీఎం బావమరిది టెండర్ అంశాన్ని ప్రశ్నించినందుకే ఈ చర్యలు చేపట్టారన్నారు. అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదని, న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ కేసుల్లానే ఈ వ్యవహారం కూడా బీఆర్ఎస్ నేతలకు క్లీన్ చిట్‌తో ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు స్పష్టంగా కనిపించిందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ, ప్రజల తరపున మాట్లాడుతున్న హరీష్‌రావుపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడేదే లేదు. భద్రత దృష్ట్యా తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని కోరాం. బీసీసీఐ ఒత్తిడితో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే అంగీకరించబోం. తాము తప్పకుంటే స్కాట్లాండ్‌ను చేర్చుతారన్న వార్తలను నిజం కాదు. గతంలో పాకిస్థాన్ భారత్‌కు రాకపోతే వేదిక మార్చారు.
-బంగ్లాదేశ్ స్పోర్ట్స్ అడ్వైజర్ ఆసిఫ్ నజ్రుల్

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
బుధవారం
21.01.2026
@prathipaksham
prathipakshamtvtelugu

హరీశ్‌తో మొదలై... కేసీఆర్‌తో ముగుస్తుందా?

గులాబీ పార్టీ గద్దెలు మొత్తం కూలాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వ్యాఖ్యలు చేశారు. గులాబీ పార్టీని వంద మీటర్ల లోతులో పాతిపెట్టాలనీ పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలు ఏదో రాజకీయ వ్యవహారంలో చేసినవని అందరూ అనుకున్నారు. కానీ, ముఖ్యమంత్రి వ్యాఖ్యల వెనుక లోతైన వ్యవహారం ఉందని ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది. ఖమ్మం సభలో రేవంత్ రెడ్డి ప్రసంగంలో ఆవేశం తాలూకు పరిణామాలు ఆ తర్వాత ఒక్కరోజు గ్యాప్ లోనే గులాబీ పార్టీపై ప్రభావం చూపించాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి ఆక్టివ్ అయింది. ఈసారి మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేసింది. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన విచారణకు హాజరు అయ్యారు. సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద ఆయనకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారుల ఎదుట హరీష్ రావు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఈ నోటీసులను హరీష్‌రావుకు అందించారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ టాపింగ్ జరిగిందని పదేపదే రేవంత్ రెడ్డి ఆరోపిస్తుండడం విదితమే. చివరికి కేసీఆర్ కుమార్తె కూడా ఫోన్ టాపింగ్ జరిగిందని చెబుతున్నారు. తన భర్త ఫోన్ ను కూడా వదిలిపెట్టకుండా దుర్మార్గంగా వ్యవహరించారని కవిత ఆరోపించడం కూడా చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఫోన్ టాపింగ్ వ్యవహారంపై వేగంగా అడుగులు వేస్తోంది. ఫోన్ టాపింగ్ వల్ల గత ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ప్రయోజనాలు పొందారు? నాటి ప్రభుత్వ పెద్దల కోసం పనిచేసిన వారు ఎలాంటి ఫలితాన్ని ఆశించారు? అనే విషయాలను బయట పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమించిన ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తున్నది. హరీష్ రావు కు సిట్ నోటీసు ఇవ్వడం సంచలనం కలిగించింది. ఈ కేసులో ముందుగా హరీష్‌రావును, ఆ తర్వాత కేటీఆర్ ను, అనంతరం కేసీఆర్ ను విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏం చేస్తుంది అనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే చాలామందిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. విచారణలో సేకరించిన సమాచారం తర్వాత హరీష్ రావుకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. హరీష్ రావును విచారించి స్టేట్మెంట్ రికార్డు చేస్తారని తెలుస్తోంది. గతంలోనే తనకు నోటీసులు అందుతాయని హరీష్ రావు చెప్పారు.. పంచాయతీ ఎన్నికలకు ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్ కు నోటీసులు ఇచ్చారని.. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తనకు కూడా ఇస్తారని హరీష్ రావు చెప్పారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే అది జరుగుతుందని హరీష్‌రావు గతంలోనే వ్యాఖ్యానించారు.. ఇక ఈ వ్యవహారంలో ముందు నుంచి కూడా కేసీఆర్ పేరు వినిపిస్తోంది. త్వరలోనే ఆయనను విచారిస్తారని.. దానికంటే ముందు నోటీసులు పంపిస్తారని ప్రచారం జరుగుతోంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
21.01.2026

గిరిజన సంస్కృతికి ప్రతీక, సమ్మక్క సారక్క జాతర

పచ్చని అడవిలో ఇసుకవేస్తే రాలనంత జనం.. కంకవనం తోడుగా కుంకుమ బరిణెలో గద్దెలకు పయనం.. కోయపూజారులతో కొలువైన చిలుకలగుట్ట దేవగణం.. తడిబట్టల తానాలతో పూనకాల ప్రభంజనం.. నిలువెత్తు బెల్లాలు తల్లులకు మొక్కులుగా సమర్పణం.. సంప్రదాయ వేషధారణల నృత్యాల సమ్మేళనం.. రెండేళ్ళకొకసారి అంబరమంటే సంబురం మన మేడారం .. కోరిన కోరికలు తీర్చే తెలంగాణ రాష్ట్ర కొంగు బంగారం..



సుధాకర్.ఏ.వి
9000674747

ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు,కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర జరుగుతుంది. సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు,కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్భాంధవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారీ సమ్మక్కసారక్క. "దేశంలోనే అతి పెద్ద గిరిజనజాతర"గా గణతికెక్కిన మేడారం జాతర గిరిజన సాంప్రదాయ రీతుల్లో జరుగుతుంది.మన రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షల కొద్దీ భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ జాతరను తెలంగాణ ప్రభుత్వం 2014లో రాష్ట్ర పండుగగా గుర్తించింది.

సమ్మక్క, సారక్కల వీరోచిత పోరాటం

నేటి జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండల ప్రాంతములోని పొలవాసను పాలించే గిరిజన దొర మేడరాజు వేటకని వెళ్లినప్పుడు ఒక పుట్ట మీద కేరింతలు కొడుతూ కనిపించిన పాపకే సమ్మక్క అని పేరు పెట్టి పెంచుకున్నాడు. సమ్మక్క వారికి పుట్ట మీద కనిపించే సమయంలో చుట్టూ పులులూ, సింహాలూ ఆమెకు రక్షణగా నిలవడం చూసి ఆమెని దైవాంశ సంభూతురాలిగా భావించారు.కన్నీరు సైతం ఎండిన కరువులో తమకు తోడుగా నిలిచేందుకు వచ్చిన దేవతగా ఆమెను కొలుచుకునేవారు. సమ్మక్క హస్తవాసి వారి నమ్మకాన్ని తరచూ రుజువు చేసేది. ఆమె చేత్తో ఆకు పసరు ఇస్తే ఎలాంటి రోగమైనా ఇట్టే నయమైపోయేదట. ఆమెను అతని మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకిచ్చి పెళ్ళి చేసాడు. ఈ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్య విస్తరణ కాంక్షతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలవాసపై దండెత్తాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు, మేడారం పారిపోయి అజ్ఞాతవాసం గడుపుతుంటాడు. మేడారాన్ని పాలించే కోయరాజు "పగిడిద్దరాజు" కాకతీయుల సామంతునిగా ఉంటూ కరువు కాటకాల పరిస్థితుల కారణంగా కప్పం కట్టలేకపోతాడు. కప్పం కట్టకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ గిరిజనులలో సార్వభౌమునికి వ్యతిరేకంగా విప్లవ భావాలు నూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణంతో పగిడిద్దరాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు, అతడిని అణచివేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో సహా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తుతాడు. సాంప్రదాయ ఆయుధాలు ధరించి పగిడిద్దరాజు,సమ్మక్క, సారక్క, నాగమ్మ, జంపన్న, గోవింద రాజులు వేర్వేరు ప్రాంతాల నుండి గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించి వీరోచితంగా పోరాటం చేస్తారు. కాని సుశిక్షితులైన అపార కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవింద రాజులు యుద్ధంలో మరణిస్తారు. పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడతాడు. అప్పటి నుండి సంపెంగవాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది. ఇక సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్పు



తిప్పలు పెడుతుంది, వీరోచితంగా పోరాటం సాగించింది. గిరిజన మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాప రుద్రుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. చివరికి శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుక గుట్టవైపు వెళుతూ మార్గ మధ్యంలోనే అదృశ్యమైంది. సమ్మక్కను వెదుక్కుంటూ వెళ్లిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు, కానీ ఆ ప్రాంతములో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల భరిణె లభించింది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

ఆసియాలోనే అతి పెద్దజాతర

జాతర మొదటి రోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకువస్తారు.రెండవ రోజున చిలుకల గుట్టలో భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తారు. దేవతలు గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు.మూడవ రోజున అమ్మవార్లు ఇద్దరు గద్దెలపై కొలువు తీరుతారు.నాలుగవ రోజు సాయంత్రము ఆవాహన పలికి దేవతలను ఇద్దరినీ తిరిగి యద్ధ స్థానానికి తరలిస్తారు.వంశ పారంపర్యంగా వస్తున్న గిరిజనులే పూజార్లు కావడం ఈ జాతర ప్రత్యేకత. సుమారు కోటికి పైగా జనం పాల్గొనే మహా గొప్ప జాతర, ఈ జాతర ఆసియా లోనే అతి పెద్ద జాతర.

జంపన్నవాగు

గోదావరి నదికి ఉపనది. చరిత్ర ప్రకారం,జంపన్న గిరిజన యోధుడు మరియు గిరిజన దేవత సమ్మక్క కుమారుడు .ఆ ప్రవాహంలో కాకటియన్ ఆర్మీకి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో అతను మరణించడంతో జంపన్న వాగు తన పేరును తీసుకున్నాడు. జంపన్న వాగు ఇప్పటికీ జంపన్న రక్తంతో గుర్తించబడిన ఎరుపు రంగులో ఉంది (శాస్త్రీయంగా నీటి ఎరుపు రంగు నేల కూర్పుకు ఆపాదించబడింది). జంపన్న వాగు యొక్క ఎర్రటి నీటిలో పవిత్రంగా ముంచడం వారిని రక్షించే వారి దేవతల త్యాగాన్ని గుర్తు చేస్తుందని మరియు వారి ఆత్మలలో ధైర్యాన్ని ప్రేరేపిస్తుందని గిరిజనులు నమ్ముతారు. జంపన్న వాగు వంతెన అని పిలువబడే జంపన్న వాగు పైన నిర్మించిన వంతెన ఉంది.

తెలంగాణ కుంభమేళా

తెలంగాణాలో జరిగే అతిపెద్ద,విశిష్ట గిరిజన జాతర మేడారం సమ్మక్కసారలమ్మ ల జాతర, ఈ జాతర రెండు ఏండ్లకు ఒక సారి జరుగుతుంది, సుమారు 900 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జాతరను 1940 వ సంవత్సరం వరకు చిలుకల గుట్టపై గిరిజనులు మాత్రమే జరుపుకునే వారు, కాని 1940 తర్వాత తెలంగాణా ప్రజలంతా కలిసి జరుపుకుంటున్నారు, ఏటేట జనం పెరుగుతుండడంతో జాతరను కొండ కింద జరపడం ప్రారంభించారు. పూర్తిగా గిరిజన సాంప్రదాయంలో జరిగే ఈ జాతరకు తెలంగాణా నుండే కాకుండా మధ్య ప్రదేశ్, చెత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఒడిషా రాష్ట్రాలనుండి సుమారు కోటికి పైగా భక్త జనం వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు.

నైవేద్యంగా బెల్లం

భక్తులు వివిధ రకాలుగా మొక్కులు చెల్లించుకుంటారు. ఈ జాతరలో బెల్లాన్ని 'బంగారం' అంటారు. భక్తులు నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి చెల్లించుకుంటారు. అంటే తమ బరువుకు సరిపోయిన బంగారాన్ని కొని అక్కడ పంచిపెడుతారు. అంతేకాకుండ ఒడి బియ్యం, తలవెంట్రుకలు ఇయ్యడం, వెదురుతొట్టె కట్టడం, కోడెలను కట్టేయడం ద్వారా తమ మొక్కులు చెల్లించుకుంటారు. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ జాతరను 1996 సంవత్సరం నుండి ప్రభుత్వం ఈ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండుగకు మరింత ప్రాచుర్యం ఏర్పడింది.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ఈనెల 28 నుండి 31వరకు జరిగే జాతరకు తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.రేవంత్ సర్కారు అనుక్షణం జాతరను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతరకు సుమారు కోటిమందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మానవ మనుగడకు, అభివృద్ధికి ప్రకృతి ఎంతో ముఖ్యం. చెట్లు, గుట్టలు, వాగులు, వంకలు, ఏర్లు వీటిని కాపాడుకోవలసిన బాధ్యత మనమీద ఉన్నది. ఏ జాతరకు వెళ్లినా ప్లాస్టిక్ చెత్త కుప్పలు కుప్పలుగా తయారవుతున్నది. జాతరలపేరిట ప్లాస్టిక్ చెత్తను తయారుచేయడం, అడవులను నరకడం వంటి వాటిని నివారించాలి.

(వ్యాస రచయిత రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు స్టేట్ టీచర్స్ యూనియన్)

రక్తసిక్తమవుతున్న మానవత్వం.. మత్తులో తూలుతున్న భవిష్యత్తు!



ముహమ్మద్ ముజాహిద్
9640622076

సమాజం నాగరికత వైపు పరుగులు తీస్తోందని మురిసిపోతున్నామా? లేక సాంకేతికత పెరిగినంత వేగంగా మనిషిలో విజ్ఞత నశిస్తోందని ఆందోళన చెందుతున్నామా? నేడు వార్తాపత్రిక తిరగేసినా, టీవీ ఛానెల్ తెరిచినా రక్తం చిందిన వార్తలే. హత్య అనేది కేవలం ఒక చట్టపరమైన నేరం మాత్రమే కాదు, అది సాక్షాత్తూ మానవత్వంపై జరిగే దాడి. ఖురాన్ సందేశం అన్నట్లు, "ఒక అమాయక ప్రాణాన్ని తీయడం అంటే, సమస్త మానవాళిని అంతం చేయడమే." కానీ, ఈ సత్యాన్ని క్షణికావేశం కమ్మేస్తోంది.

ఆవేశం: అనర్థాలకు పేట్రేగుతున్న అగ్ని

మనిషిని పతనం చేసే ఆయుధం ఏదైనా ఉందంటే అది 'అదుపులేని కోపం'. కోపం శక్తివంతమైనదిగా అనిపించవచ్చు, కానీ దాని పర్యవసానాలు మాత్రం ఒక తరాన్నే ఛిన్నాభిన్నం చేస్తాయి. ఒక ప్రాణం బలిగొన్నప్పుడు కేవలం మనిషి మాత్రమే మరణించడు; ఒక కుటుంబం వీధిన పడుతుంది, సమాజంలో నమ్మకం కుప్పకూలుతుంది. కుస్తీ పోటీలో ప్రత్యర్థిని కింద పడేయడం కాదు, ఆగ్రహం కట్టలు తెంచుకున్నప్పుడు తనను తాను నిగ్రహించుకోగలవాడే నిజమైన ధీరుడని ప్రవక్త (స) బోధనలు మనకు గుర్తు చేస్తున్నాయి. కానీ, నేటి యువత నిగ్రహాన్ని నిర్వీర్యం చేసుకుంటూ, ప్రతీకారాన్ని పౌరుషంగా భ్రమపడుతోంది.

మత్తు కోరల్లో యువతరం

హింసకు తోడు నేడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న మరో మహమ్మారి 'మత్తు'. డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలు యువత ఆలోచనా శక్తిని హరిస్తున్నాయి. మత్తులో ఉన్న మెదడుకు మంచిచెడుల విచక్షణ ఉండదు. ఆ మత్తులో నుండే అమానవీయ ఘటనలు పుట్టుకొస్తున్నాయి. లక్ష్యం లేని జీవితం, బాధ్యత లేని వ్యక్తిత్వం, విలువల గాలి సోకని పెంపకం ఇవే నేరాల ఊబికి పునాదులు. "మేము మిమ్మల్ని వృధాగానే పుట్టించామని భావిస్తున్నారా?" అన్న దివ్య ఖురాన్ వాక్యం ప్రతి ఒక్కరినీ ప్రశ్నించాలి.

ఒక ఆశాకిరణం: జమాతే ఇస్లామీ హింద్ ఉద్యమం

ఈ సామాజిక విచ్ఛిన్నతను అడ్డుకోవడానికి, మానవత్వాన్ని కాపాడుకోవడానికి జమాతే ఇస్లామీ హింద్ (JIH) నడుం బిగించడం ఒక శుభపరిణామం. జనవరి 18 నుండి 31 వరకు "మానవత్వాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో చేపట్టిన ఈ ప్రచార ఉద్యమం ఎంతో సమయోచితమైనది. హత్యలు, డ్రగ్స్ వంటి సామాజిక రుగ్మతల నిర్మూలనకు JIH సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముబష్షిర్ అహ్మద్ ప్రకటించిన 10 రోజుల అవగాహన కార్యక్రమాలు సమాజానికి అత్యంత అవసరం. యువతరాన్ని మత్తు నుంచి, హింస నుంచి కాపాడటం కోసం వారు చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయం.



సంస్కరణ ఇల్లే పునాదిగా..

ఎక్కడైతే మార్గదర్శకత్వం కరువవుతుందో, అక్కడే హింస రాజ్యమేలుతుంది. కుటుంబ బంధాలు కేవలం అవసరాలకే పరిమితం కాకూడదు. అనురాగానికి దూరం కావడం మనిషిలో అసహనాన్ని పెంచుతుంది. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు కేవలం సంపాదన మాత్రమే కాదు, 'సహనాన్ని' కూడా వారసత్వంగా ఇవ్వాలి. వివాదాలు తలెత్తినప్పుడు పగతో రగిలిపోవడం కాదు, "చెడును మంచితనంతో జయించడం" నేర్చుకోవాలి. ప్రతీకారం తీర్చుకోవడం న్యాయం అనిపించవచ్చు, కానీ అది సర్వస్వాన్ని దహించివేసే కార్చిచ్చు అని మరువకూడదు.

ముగింపు: మార్పు మనతోనే..

పౌరుషం అనేది కత్తి పట్టి రక్తం చిందించడంలో లేదు, కన్నీరు తుడిచే కరుణలో ఉంది. ఆధిపత్యాన్ని ప్రదర్శించడం గెలుపు కాదు, ప్రశాంతతను పంచడమే అసలైన విజయం. సమాజం హింస వైపు మళ్లకుండా ఉండాలంటే, ఆలోచనలో మార్పు రావాలి. ఆవేశం కట్టలు తెంచుకోకముందే సంభాషణతో పరిష్కరించుకునే విజ్ఞతను అలవర్చుకోవాలి. గుర్తుంచుకోండి.. హింస విడిచిన గాయం తరతరాల వరకు ఆ వేదనను మిగిల్చుతుంది. ఆ గొలుసును తెంచే సాహసం చేద్దాం. శాంతిని, సహనాన్ని ఆయుధాలుగా చేసుకుని ఒక ప్రాణాన్ని కాపాడే బాధ్యతను భుజాన వేసుకుందాం. మనిషిని మనిషిగా ప్రేమించే గుణమే అసలైన నాగరికత.

మున్సిపల్ ఎన్నికలు: పట్టణ హృదయ స్పందన



చిటికెన కిరణ్ కుమార్
9490841284

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక కాగితపు ముక్క కాదు; అది ప్రజల అనుభవాల సమ్మేళనం. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకూ ప్రతి ఎన్నిక కూడా పాలకులకు ఒక అద్దం. అందులో కనిపించేది ప్రచార నినాదాల ముఖచిత్రం కాదు, ప్రజల జీవితాల నిజమైన ప్రతిబింబం. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల వాతావరణం మొదలైన ఈ తరుణం, పట్టణ ప్రజల మనోభావాలను చదవడానికి ఒక అవకాశంగా మారింది. మున్సిపాలిటీ అనేది పరిపాలనా యూనిట్ మాత్రమే కాదు; అది రోజువారీ జీవితానికి కేంద్రబిందువు. ఉదయం తాగునీటి ట్యాప్ నుంచి, సాయంత్రం వెలిగే వీధిదీపం వరకూ పట్టణ వాసి అనుభవించే పాలన మున్సిపల్ పాలననే. అందుకే మున్సిపల్ ఎన్నికలు వచ్చాయంటే, ప్రజల మౌన అసంతృప్తులు మాటలుగా మారుతాయి; ఆశలు ఓటుగా రూపాంతరం చెందుతాయి. తెలంగాణలో పట్టణీకరణ వేగం పెరిగిన కొద్దీ, మున్సిపాలిటీల పాత్ర మరింత విస్తరించింది. ఒకప్పుడు గ్రామాలకే పరిమితమైన సమస్యలు, ఇప్పుడు పట్టణ అంచుల్లో కొత్త రూపంలో ఎదురవుతున్నాయి. ఉపాధి కోసం వచ్చిన కుటుంబాలు, మౌలిక వసతుల కొరత, నిరంతరం పెరుగుతున్న జీవన వ్యయం ఇవన్నీ మున్సిపల్ ఎన్నికల నినాదాల వెనుక దాగిన నిజాలు. ప్రజలు ఇప్పుడు అభివృద్ధి అనే మాటను వినడం కాదు; అది తమ వీధిలో కనిపించాలనే కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి కేవలం స్థానిక పాలనకే పరిమితం కావు. మున్సిపల్ ఫలితాలు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందస్తు సంకేతాలుగా మారుతున్నాయి. ఓటరు తన అసంతృప్తిని నేరుగా పెద్ద ఎన్నికల్లో వ్యక్తం చేయలేకపోయినా, మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం స్పష్టంగా తెలియజేస్తాడు. అందుకే రాజకీయ పార్టీలకు ఇవి ఒక పరీక్షలాంటివి ప్రచారం ఎంత పనిచేసింది, పాలన ఎంత చేరుకుంది అన్నది ఇక్కడే తేలిపోతుంది. మున్సిపల్ ఎన్నికల్లో వ్యక్తి పాత్ర పార్టీ గుర్తుతో సమానంగా నిలుస్తుంది. ప్రజలు ఇప్పుడు "ఎవరు గెలుస్తారు?" అనే ప్రశ్న కంటే, "ఎవరు పనిచేస్తారు?" అనే ప్రశ్నను ముందుకు తెస్తున్నారు. కాలువ శుభ్రం చేయని కౌన్సిలర్ పేరు, సమావేశాల్లో కనిపించని ప్రజాప్రతినిధి ముఖం ఇవన్నీ ఓటరు జ్ఞాపకంలో మిగిలిపోతాయి. ఓటు వేయబోయే రోజున అవే తీర్పుగా మారుతాయి. ప్రచార వాతావరణంలో పెద్ద మాటలు, పెద్ద హామీలు వినిపించినా, ఓటరు నిర్ణయం



మాత్రం చిన్న అనుభవాల మీదే ఆధారపడి ఉంటుంది. వర్షం వస్తే నీటమునిగే రోడ్డు, చెత్తతో నిండిన ఖాళీ స్థలం, పనిచేయని వీధిదీపం ఇవే రాజకీయ విశ్లేషణకు మూలగ్రంథాలు. మున్సిపల్ ఎన్నికలు ఈ అనుభవాల సంకలనమే. ఈ ఎన్నికల ఫలితాలు పాలకులకు ఒక హెచ్చరికగా, ప్రతిపక్షాలకు ఒక అవకాశంగా మారతాయి. ప్రజలు ఇచ్చే తీర్పు శాశ్వతం కాదు; అది పాలనకు ఇచ్చే తాత్కాలిక సర్టిఫికెట్ మాత్రమే. దానిని నిలబెట్టుకోవాలంటే, ఎన్నికల తర్వాత కూడా ప్రజల మధ్యే ఉండాలి. మున్సిపాలిటీ గెలుపు అనేది అధికారానికి తొలి మెట్టు మాత్రమే; బాధ్యతకు ముగింపు కాదు. చివరికి చెప్పాలంటే, తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఒక రాజకీయ సంఘటన మాత్రమే కాదు అవి పట్టణ జీవితం పలికించే సాహిత్యం. అక్కడ ప్రతి ఓటు ఒక వాక్యం, ప్రతి ఫలితం ఒక భావం. ఆ భావాన్ని చదివినవారే రాబోయే పెద్ద ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలరు. ప్రజాస్వామ్యంలో చిన్న ఎన్నికలంటూ ఏవీ లేవు; ప్రతి తీర్పూ చరిత్రలో ఒక చిన్న అక్షరంగా అయినా నిలిచిపోతుంది.

(వ్యాస రచయిత ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు ఐబిఆర్ఎస్ సభ్యులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రతిపక్షం
Prathipaksham.in



ప్రాంతీయం

ప్రశ్నిస్తే కేసులు పెడతారా..?

- గులాబీ నేతల ఫైర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: ఫోన్ టాపింగ్ కేసులో హరీష్ రావుకు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం 'స్కీమ్ ల' (పథకాల) ప్రభుత్వంగా వెలిగిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'స్కామ్ ల' (కుంభకోణాల) ప్రభుత్వంగా మారిందని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వంపై పోరాడుతున్న హరీష్ రావును ఎదుర్కోలేక, భయంతోనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారురేవంత్ రెడ్డి గతాన్ని గుర్తు చేస్తూ, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారుల పై తుపాకీ ఎక్కుపెట్టిన 'రైఫిల్ రెడ్డి' అని ఆయన ఎద్దేవా చేశారు. నాడు టీడీపీలో ఉండి తెలంగాణ సాధనను అడ్డుకున్న రేవంత్ రెడ్డి, నేడు ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడిన హరీష్ రావు వంటి ఉద్యమకారుడిని వేధించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని కుయుక్తులు పన్నినా రేవంత్ రెడ్డి అవినీతిపై హరీష్ రావు పోరాటం ఆగదని, తెలంగాణ సమాజం మొత్తం హరీష్ రావు వెంటే ఉందని మధుసూదనా చారి స్పష్టం చేశారు. ప్రభుత్వ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే రేవంత్ రెడ్డి అరాచకాలను నిలదీసే రోజు దగ్గరలోనే ఉందని ఆయన హెచ్చరించారు.

తెలంగాణలో 'దండుపాళ్యం ముఠా' పాలన

తెలంగాణలో ప్రస్తుతం 'దండుపాళ్యం ముఠా' పాలన సాగుతోందని, ఆ ముఠాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సుమారు 1600 కోట్ల రూపాయల విలువైన సింగరేణి బొగ్గు గనుల కాంట్రాక్ట్ అక్రమాలను హరీష్ రావు బయటపెట్టినందుకే, ఆయనకు సిట్ ద్వారా నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మంత్రులు అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని, వాటిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల పై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం, విద్యుత్, రేస్ కార్ వంటి వివిధ కేసుల పేరుతో టీవీ సీరియల్ తరహాలో రోజుకో డ్రామా ఆడుతూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సివిల్ సప్లైస్ శాఖలో భారీ అవినీతి జరిగిందని, సమ్మక్కసారక్క టెండర్ల విషయంలో మంత్రుల మధ్యే గొడవలు జరుగుతున్నాయని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. హ్యామ్మోడ్ల పేరుతో మరో పెద్ద కుంభకోణానికి తెరలేపారని, పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి తన బంధువులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కుంభకోణాలపై విచారణ జరిపేందుకు సిట్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. హరీష్ రావుకు గతంలోనే సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని, అయినా కావాలని నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని ప్రశాంత్ రెడ్డి అన్నారు.

బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సిట్ నోటీసులు

తెలంగాణలో గత రెండేళ్లుగా పాలన సాగడం లేదని, కేవలం టీవీ సీరియళ్ల మాదిరిగా రోజుకో కొత్త కేసు పేరుతో 'డ్రామా' నడిపిస్తున్నారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టినందుకే, ప్రభుత్వం భయపడి ఆయనకు సిట్ నోటీసులు ఇచ్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు కేసులు, జైళ్లు కొత్త కాదని.. ఉద్యమ సమయంలో కేటీఆర్, హరీష్ రావు అనేకసార్లు జైలుకు వెళ్లారని, ఇప్పుడు ఈ బెదిరింపులకు ఎవరూ లొంగబోరని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్ లేదా హరీష్ రావులను ఎంతగా వేధించాలని చూస్తే, తెలంగాణ సమాజం అంతకంటే ఉవ్వెత్తున ఎగసిపడుతుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరిగిన ఈ భారీ బొగ్గు కుంభకోణంపై పార్లమెంటులో కూడా గళమెత్తుతానని రవిచంద్ర తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను దారుణంగా మోసం చేసిందని, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపు నిలబడి అత్యధిక స్థానాల్లో గెలిపించారని గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే ఫలితం పునరావృతం అవుతుందనే భయంతోనే, విపక్ష నేతల అటెన్షన్ డైవర్ట్ చేయడానికి ఈ తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు.

మున్సిపల్ బరిలో తెలంగాణ జాగృతి



ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 20: నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సుమారు 20 నుంచి 30 స్థానాల్లో తమ అభ్యర్థులను దింపేందుకు కవిత వ్యూహరచన చేస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్ లోని ఆమె నివాసంలో ఆశావహులతో సమావేశమయ్యారు. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థుల ప్రకటన వెలువడనుంది. సొంత గడ్డపై సత్తా చాటాలని చూస్తున్న జాగృతి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై పోటీ చేసే అవకాశం ఉంది.




సామాజిక రుగ్మతల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

- పోలీస్ కమిషనర్ సజ్జనార్
- మానవత్వాన్ని కాపాడుకుందాం
- పోలీస్ కమిషనర్‌ను కలిసిన జమాఅతే ఇస్లామీ హింద్ బృందం

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, జనవరి 20: సమాజంలో వేగంగా విస్తరిస్తున్న డ్రగ్స్ వంటి మహమ్మారులను తరిమికొట్టేందుకు, మానవత్వ విలువలను కాపాడేందుకు స్వచ్ఛంద, ధార్మిక సంస్థలు బాధ్యతగా ముందుకు రావడం శుభపరిణామమని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ప్రశంసించారు. జమాఅతే ఇస్లామీ హింద్ హైదరాబాద్ సిటీ విభాగం ఆధ్వర్యంలో జనవరి 18 నుండి 30 వరకు నిర్వహించనున్న "మానవత్వాన్ని కాపాడుకుందాం" ప్రచార ఉద్యమ వివరాలను ఆ సంస్థ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. ముఖ్య నేతల భేటీ పోలీస్ కమిషనర్‌ను కలిసిన వారిలో జమాఅతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ అజ్ హరుద్దీన్, సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముబష్షిర్ అహ్మద్, సిటీ సెక్రటరీలు ఆజమ్ అలీ బేగ్, అబ్దుల్ ఖాదిర్ నాసిర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు ప్రచార ఉద్యమ కార్యాచరణ పత్రాన్ని కమిషనర్‌కు అందజేసి, తాము చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. అందులో ప్రధానంగా యువత చైతన్యం.. డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా యువతీ యువకుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహించడం. వైద్య సహాయం... 'డేర్' (DARE) వైద్య బృందం ద్వారా మురికివాడల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్న వారికి నిపుణులతో కౌన్సెలింగ్. డీఅడిక్షన్ సందర్శన... వ్యసనాలకు లోనైన వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అడిక్షన్ సెంటర్లను సందర్శించి బాధితులకు భరోసా కల్పించడం. ప్రభుత్వ పథకాల ప్రచారం... 'నషా ముక్త్ భారత్' వంటి ప్రభుత్వ పథకాలను సామాన్యులకు చేరువ చేయడం వంటివి ఉన్నాయి. పోలీస్ శాఖ పూర్తి సహకారం సామాజిక రుగ్మతల నిర్మూలన కేవలం చట్టాల ద్వారానే కాకుండా, సామాజిక , ధార్మిక సంస్థల సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. జమాఅతే ఇస్లామీ హింద్ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఈ ప్రచార ఉద్యమానికి పోలీస్ శాఖ తరపున పూర్తి స్థాయి సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

ప్రతి రైతూ సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలి

- పొలాల్లో కెమికల్స్‌తో కూడిన ఎరువులు వాడటం వల్ల నేల విషంగా మారుతోంది
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- భూమికి విరామం ఇద్దాం: జీయర్ స్వామి



ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, జనవరి 20: ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో సిద్దార్థ యోగ విద్యాలయంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడటం వల్ల నేల విషతుల్యమవుతోందన్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని చెప్పారు. ప్రతి రైతూ గతంలో మాదిరిగా సేంద్రియ సాగు వైపు దృష్టి సారించాలని చెప్పారు. దేశంలో అత్యంత సారవంతమైన భూములు ఉన్నాయని నారాయణ అన్నారు. ఇక్కడ చదువుకున్న యువత ఇతర దేశాలకు వెళ్లి పనిచేస్తున్నారని చెప్పారు. ఇక్కడ మనకు అన్నీ ఉన్నాయని, కానీ ఇంకా కరువులోనే బతుకుతున్నామని తెలిపారు. విత్తనాలు, ఎరువు కంపెనీలు బడా బాబులవే అని.. అవి కొనడం వల్ల కార్పొరేట్ కంపెనీలు లాభపడుతున్నాయని చెప్పారు. చిన్న జీయర్ స్వామి సమాజం బాగుండాలని ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. తన చివరి ఊపిరి ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

భూమికి విరామం ఇద్దాం: జీయర్ స్వామి

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ స్వామి పాల్గొని ప్రసంగించారు. సుపల అనేది భూమి పేరని.. భూమి పవిత్రతను నిలబెట్టే స్థితిని కల్పించాలన్నారు. పంట ఇస్తోందని భూమిలో నాలుగు పంటలు పండిస్తే త్రాగడానికి నీరు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని వెల్లడించారు. అత్యాశ వల్ల సమూల నాశనం జరుగుతుందని చెప్పుకొచ్చారు. కావలసినవి ఇవ్వగలిగే శక్తి భూమికి ఉందని అన్నారు. మనిషికి ఆలోచన చెడితే విషం అవుతుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఆవులను పాశ్చాత్య దేశాల వారు పాల కోసమే పెంచుతారని.. భారతదేశంలో కూడా రైతులు అదే బాటలో పయనిస్తున్నారని.. వాటివల్ల పశువులు రోగాల బారిన పడ్డాయన్నారు. వస్తువులను హైబ్రిడ్ అని పెంచడం వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారని ఆయన అన్నారు.రోజు తినే ఆహారం అంతా కలుషితమే అని వెల్లడించారు. ప్రతి వస్తువులోనూ దేవుడు ఉన్నాడని.. ప్రకృతి బాగుంటేనే మనుష్యులు జీవించగలరని స్పష్టం చేశారు. గతంలో క్యాన్సర్ అనేది వినిపించేది కాదని.. ఇప్పుడు ప్రతి ఊర్లో వినిపిస్తోందన్నారు. మనం పండించే పంట, జీవించే విధానమే రోగాలన్నింటికీ కారణమన్నారు. ప్రకృతి వనరులను నాశనం చేస్తే మనిషి మనుగడ కష్టం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సర్వప్రాణి సేవ చేయాలని.. భూమికి కూడా ప్రాణం ఉంటుందని... దానికి కూడా విరామం ఇవ్వాలని త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ స్వామి పేర్కొన్నారు.



బాచుపల్లిలో 2.30 ఎకరాల పార్కును కాపాడిన హైడ్రా

- రూ. 300 కోట్ల విలువైన భూమికి ఫెన్సింగ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 20: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం, గ్రామంలో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఆ పక్కనే ఎమ్మార్వో కార్యాలయానికి కేటాయించిన 30 గుంటల ప్రభుత్వ భూమిని కూడా కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపించింది. సర్వే నంబరు 142, 143, 144లో ఉన్న 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని 2016లో అప్పటి జిల్లా కలెక్టర్ పార్కు కోసం కేటాయించారు. మొక్కలు నాటి పార్కును అభివృద్ధి చేశారు. అర్బన్ నర్సరీని ఏర్పాటు చేశారు. వందలాది మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచారు. బోర్‌వెల్, వాటర్ సంప్, వాచ్‌మన్ గది, ఇనుప గేట్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 2023లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పార్కులోని మొక్కలను ధ్వంసం చేసి నర్సరీని తొలగించారు. తమ ల్యాండ్‌గా చెబుతూ రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా పరిశీలించింది. పార్కు స్థలంగానే నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను తొలగించింది. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. అదే సర్వే నంబర్లలో 30 గుంటలు ఎమ్మార్వో కార్యాలయానికి కేటాయించిన స్థలం కూడా కబ్జాలకు గురైతే.. ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 30 గుంటల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థలాన్ని కాపాడడంతో బాచుపల్లి నివాసితులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. హైడ్రా, ప్రభుత్వానికి మద్ధతుగా నినాదాలు చేశారు.



ఖాజాగూడ చెరువు కబ్జాలపై హైడ్రా దృష్టి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 20 : ఖాజాగూడ చెరువు కబ్జాల లెక్కలు తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఖాజాగూడ చెరువు తూములు, అలుగులు మూసేయడం.. డైవర్ట్ చేయడంపై మీడియాలో వచ్చిన కథనాలతో పాటు.. ప్రజల నుంచి ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖాజాగూడ చెరువు అలుగుతో పాటు తూములు మూసేయడం డైవర్ట్ చేసినట్టు గుర్తించారు. ఖాజాగూడ చెరువు కింద భాగంలో దీనికి అనుసంధానంగా ఉన్న చిన్న చెరువు రూపురేఖలు మార్చినట్టు గుర్తించారు. చెరువు ఆనవాళ్లు లేకుండా చేయడాన్ని గమనించారు. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంతమంది షెడ్డులు నిర్మించినట్టు గుర్తించారు.



హరీశ్ రావుపై కక్ష సాధింపు చర్యలు మానాలి

- హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 20 : మాజీ మంత్రి హరీశ్ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలను తక్షణమే మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూనే వాస్తవాలు మాట్లాడే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులు విడనాడి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య, సీనియర్ నాయకులు బీలు నాయక్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బూర వెంకన్న గౌడ్, చిత్తారి శ్రీనివాస్, వాల నవీన్, గందే చిరంజీవి, కుడితాటి భాస్కర్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, పిట్టల జ్యోతి బాస్, బొల్లి శ్రీనివాస్, పూదరి రవీందర్ గౌడ్, కందుకూరి సతీష్, జేరిపోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ఓదెల మల్లన్న ప్రథమ వార్షికోత్సవాలు

ప్రతిపక్షం, చిగురుమామిడి, జనవరి 20: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి, బొమ్మనపల్లి గ్రామాల పొలిమేరలో వెలసిన శ్రీ హరి హర ఓదెల మల్లన్న క్షేత్రంలో ప్రథమ వార్షిక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


మూడు రోజుల పాటు విశేష పూజలు

ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు (శుక్రవారం) ఉదయం 8 గంటల నుంచి మహాగణపతి సహిత విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, దీక్షా కంకణధారణ, రుద్రాభిషేకం, శ్రీ ధన్వంతరి సహిత రుద్ర హోమం మరియు శ్రీరామ యజ్ఞం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండో రోజైన 24వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు స్వామివారికి పుష్పయాగం, సాయంత్రం 5 గంటలకు స్వయంభు ఓదెల మల్లన్న గుట్ట వద్ద గిరి ప్రదక్షిణ చేపట్టనున్నారు.



ముగింపు రోజున పెద్ద పట్నాలు

ఉత్సవాల ముగింపు రోజైన 25వ తేదీ ఆదివారం ఓదెల మల్లన్న 'పెద్ద పట్నాలు' వేసే కార్యక్రమం కన్నులపండువగా జరగనుంది. ఈ మూడు రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



శ్రీ హరి హర పీఠం వ్యవస్థాపకులు, ఆలయ ప్రధాన అర్చకులు కుర్జి ఆదిశేషు వర్ధన స్వామి పర్యవేక్షణలో ఈ యజ్ఞ యాగాదులు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి, కృపకు పాత్రులు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ మరియు ధర్మకర్తలు కోరారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ

మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డ్ లల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్



ఫోన్ ట్యాపింగ్ కేసులో అవసరమైతే హరీశ్ రావును మళ్లీ విచారణకు పిలుస్తాం. ఈ కేసులో హరీశ్‌ను ఇవాళ విచారించాం. ఆయనకు సుప్రీంకోర్టులో స్టే రాలేదు. తన కుమారుడు అమెరికా వెళ్తున్న కారణంగా ముందుగా బయల్దేరి వెళ్లేందుకు ఆయనకు అనుమతి ఇచ్చాం. కేసులో సాక్షులను ప్రభావితం చేయొద్దని సూచించాం.

- హైదరాబాద్‌సీపీ, సిట్ చీఫ్ సజ్జనార్



ప్రతి డివిజన్ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం


- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 20 : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 16, 17, 37, 38, 39, 21, 44, 46 వ డివిజన్లో పరిధిలో నీ పలు ప్రాంతల్లో టి యు ఎఫ్ ఐ డి నిధుల కింద డివిజన్కు కోటి రూపాయలు చొప్పున అభివృద్ధి పనులకు అర్బన్ ఎమ్మెల్యే భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడానికి వచ్చిన అర్బన్ ఎమ్మెల్యే కు ప్రతి డివిజన్లో అడుగడుగునా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి అర్బన్ నియోజకవర్గం ప్రజలు మద్దతు పలికి బిజెపి పార్టీని మెజార్టీ స్థానాల్లో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమాలలో పబ్లిక్ హెల్త్ డీఈ ఇంచార్జ్ మునిసిపల్ నగేష్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఇ లు శివకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

తండ్రి చూపిన అభిమానం.. కొడుక్కి టికెట్!!

- అభిమానికి జగ్గారెడ్డి సర్‌ప్రైజ్!

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 20:







మున్సిపల్ ఎన్నికల వేళ సంగారెడ్డిలో ఆదివారం ఒక అరుదైన, భావోద్వేగభరిత రాజకీయ ఘట్టం చోటుచేసుకుంది. రాజకీయాల్లో విశ్వాసానికి, మానవ సంబంధాలకు జగ్గారెడ్డి ఎంత విలువ ఇస్తారో చాటిచెప్పే ఈ ఘటన అక్కడున్నవారందరినీ కదిలించింది. తనను నమ్మిన ఒక సామాన్య డ్రైవర్ మాటలను రెండు దశాబ్దాల తర్వాత కూడా గుర్తు పెట్టుకుని, ఆ వ్యక్తి కుమారుడికి కౌన్సిలర్ టికెట్ ఇవ్వడం రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది.

కౌన్సిలర్ టికెట్ కోసం ఐబీకి...

మున్సిపల్ రిజర్వేషన్లు వెలువడిన నేపథ్యంలో ఆశావహులు టికెట్ల కోసం పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలోనే 34వ వార్డు నుంచి ఆశావహుడిగా ఉన్న ఎండీ హమీద్ అలియాస్ అద్దూ, తమ గల్లీకి చెందిన పెద్దమనిషి క్రిష్ణతో పాటు స్థానికులను వెంటబెట్టుకొని సంగారెడ్డిలోని ఐబీలో ఉన్న జగ్గారెడ్డిని కలిశారు. అద్దూ చాలా కాలంగా పార్టీకి సేవలందిస్తున్నారని, అతడికి కౌన్సిలర్ టికెట్ ఇవ్వాలని క్రిష్ణ విజ్ఞప్తి చేశారు. వారి మాటలు విన్న జగ్గారెడ్డి ఒక్కసారిగా అద్దూ వైపు చూసి "మీ నాన్న ఫొటో ఒకసారి చూపించు" అని అడగడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.

ఫొటో చూసిన వెంటనే...

జ్ఞాపకాల తలుపులు తెరుచుకున్నాయి! అద్దూ తన తండ్రి హషం అలీ ఫొటో చూపించగానే జగ్గారెడ్డి ఒక్కసారిగా పాత జ్ఞాపకాలలోకి వెళ్లిపోయారు. "హషం అలీ డీసీసీబీ బ్యాంకు మేనేజర్ దగ్గర డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2003లో నేను హైదరాబాద్‌లో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో రోడ్డుపక్కన నిలబడి ఉన్నాను. అప్పుడే మేనేజర్ కారును నడుపుకుంటూ వెళ్తున్న హషం అలీ నన్ను చూసి, కారు ఆపి నా దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు" అని భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు. "అన్నా... మిమ్మల్ని ఇక్కడ చూడటం చాలా సంతోషంగా ఉంది" అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించాడని, చాలాసేపు తనతో మాట్లాడాడని జగ్గారెడ్డి తెలిపారు.

"మీరు ఎమ్మెల్యే అవుతారు" అన్న విశ్వాసం

"మీరు ఏ పార్టీ నుంచైనా సరే టికెట్ తెచ్చుకోండి. మేమంతా మీ వెంట ఉంటాం. కచ్చితంగా మీరు ఎమ్మెల్యే అవుతారు" అని హషం అలీ తనపై అపారమైన నమ్మకంతో 2004 లో చెప్పాడని జగ్గారెడ్డి సభలో వివరించారు. ఆ మాటలు తన మనసులో శాశ్వతంగా నిలిచిపోయాయని అన్నారు. ఈ విషయాలన్నీ గల్లీ ప్రజల సమక్షంలో వివరించిన జగ్గారెడ్డి, అప్పటికప్పుడే అద్దూను 34వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆనందంలో గల్లీ ప్రజలు ఈ ప్రకటనతో అక్కడికి వచ్చిన పెద్దమనిషి క్రిష్ణతో పాటు గల్లీ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. "తండ్రి చేసిన మంచిని మర్చిపోకుండా కొడుకుకు న్యాయం చేయడం జగ్గారెడ్డికే సాధ్యం" అంటూ ప్రశంసలు కురిపించారు. సామాన్య డ్రైవర్ అయిన హషం అలీ చూపిన అభిమానం, విశ్వాసానికి రాజకీయంగా గౌరవం లభించిన ఈ ఘటన విశ్వాసానికి విలువ ఇచ్చే రాజకీయానికి ప్రతీకగా నిలిచింది.



రోడ్డు నిబంధనలు పాటించి

సురక్షితంగా ఇంటికి చేరాలి

- సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 20: సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని భరత్ నగర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు వాహనదారులకు రోడ్డు నిబంధనలపై కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజలందరూ సహకరించి సిద్దిపేటను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. అలాగే రోడ్లపై అతివేగంతో ప్రయాణించడం, ఓవర్‌లోడింగ్ చేయడం వలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వాసుదేవరావు స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక పోలీస్ సిబ్బంది, వాహనదారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో బీజేపీ విజయ సంకల్ప సమావేశం

- భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు



ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 20: త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మెదక్ పార్లమెంట్ పరిధిలోని గజ్వేల్ మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 500 బైకులతో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ గజ్వేల్ పట్టణంలో ఆకట్టుకుంది. అనంతరం ప్రజ్ఞా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావించిన ఆయన, గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు 9,184 ఓట్లు, బీజేపీకి 10,404 ఓట్లు, బీఆర్ఎస్‌కు 10,820 ఓట్లు వచ్చాయని తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గజ్వేల్‌లో మెజారిటీ సాధించలేకపోయిందన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా తన మూడు సంవత్సరాల పాలనలో ఎప్పుడూ ప్రజలకు అందుబాటులోనే ఉన్నానని పేర్కొన్న ఎంపీ, గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ 13 సంవత్సరాల కాలంలో కనీసం 10 సార్లు కూడా గజ్వేల్‌కు రాలేదని విమర్శించారు. రింగ్ రోడ్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి హామీలు ఇప్పటికీ నెరవేరలేదని ఆరోపించారు. గజ్వేల్ మున్సిపాలిటీని నూటికి నూరు శాతం బీజేపీ కైవసం చేసుకుంటుందనే నమ్మకం వ్యక్తం చేసిన ఆయన, దేశమంతటా బీజేపీ పార్టీ విజయ పథంలో దూసుకుపోతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచవ్యాప్తంగా ఘన స్వాగతం పొందుతున్నారని, భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దే దిశగా ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. మల్లన్న సాగర్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 240 కోట్ల పరిహార హామీ ఇప్పటికీ అమలుకాలేదని, బాధిత గ్రామాలను గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటికీ కొత్త వార్డులు పెంచలేదని ఆయన విమర్శించారు. అలాగే గజ్వేల్‌లో నిర్మించిన ఆసుపత్రిలో స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ మున్సిపాలిటీ ఇంచార్జ్ ఆకుల విజయ, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రహదారి నిబంధనలు పాటించండి

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 20: వాహనాలు నడిపేటప్పుడు రహదారి నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని రాజగోపాల పేట ఎస్సై వివేక్ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నంగునూరు మండలం నర్మేటలో రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజగోపాల పేట ఎస్ఐ వివేక్ ఈ సదస్సులో పాల్గొని వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వివేక్ మాట్లాడుతూ వాహన చోదకులు మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేసిన వారవుతారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులకు సహకరించి ప్రమాద రహిత జిల్లాగా సిద్దిపేటను తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. గ్రామీణ రోడ్లపై అతివేగంతో వెళ్లడం, ఓవర్ లోడ్ తో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని వాహనదారులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వివేక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, వాహన దారులు పాల్గొన్నారు.



మక్తల్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, జనవరి 20: మక్తల్ పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో క్రీడా, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఎన్నికల్లో పోటీ చేయదలచుకున్న ఆశావాహులు తదితర నేతలు ఈసమావేశనికి హాజరయ్యారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా తీసుకోవాల్సిన విధి విధానాల పై ఈ సమావేశంలో చర్చించారు.



మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కుల పంపిణీ
- పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 20 : మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో అర్హులైనా లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాధీముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, స్థానిక ఎమ్మార్వో తహసీల్దార్, ఎంపీడీవో సంధ్య, రంగారెడ్డి జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజు, మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ బాకారం జాగిర్ గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు బంది అనిల్ ముదిరాజ్, రాధిక రాఘవరెడ్డి, కొండకల రవి, మాడి దినేష్ రెడ్డి, కొండకళ్ళ స్వాతి మహేందర్, ఉపేందర్ యాదవ్, నాగేశ్వర్ రెడ్డి, నాయకులు చాకలి రాజు, బాలరాజ్, ఆలూరు సత్యనారాయణ, విష్ణు, భాగం సిద్దేష్, బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

- ప్రభుత్వ ఛీప్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, డీసీపీ యోగేష్ గౌతమ్

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 20 : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ప్రభుత్వ ఛీప్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జేపీఎల్ కన్వేన్షన్ హాల్ లో ఫ్యూచర్ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతావారోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోడ్డు భద్రతా నియమాలను పాటించి వాహనాలను నడపాలని అన్నారు. వాహనందారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పని సరిగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తే చర్యలు తప్పని తెలిపారు. వాహనందారులు సీట్ బెల్టులను ధరించాలని, ద్విచక్రవాహనందారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మధ్యం సేవించి వాహనాలను నడిపితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, సీఐ పవన్ కుమార్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర నిధులను మింగిన మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి

- ఇందూర్ గా పేరు మార్పిడి ఖాయం
- ఎంపీ అరవింద్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 20 : రాష్ట్రంలో అభివృద్ధి పనుల కొరకు కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి పక్కదారి పట్టించి భారీ అవినీతికి పాల్పడ్డాడని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ హెల్త్ స్కీమ్ కింద కేంద్రం విడుదల చేసిన కోట్ల రూపాయలను కేసీఆర్ ప్రభుత్వం పక్కదారి పట్టించారని ఆరోపించారు. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి తన హయాంలో జిల్లా అభివృద్ధి నిధులతో పాటు మిషన్ భగీరథ నిధులను ఇష్టారాజ్యంగా మళ్లించారని దుయ్యబట్టారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సాగించిన దోపిడీ ఎంతో ఉందన్నారు. మళ్లించిన ఆ నిధులను అక్రమాలను సరి చేయడానికే ఎంతో సమయం పడుతోందని తెలిపారు. బీఆర్ఎస్ పని ఇప్పటికే అయిపోయిందని, ఆ పార్టీలో ప్రశాంత్ రెడ్డి వంటి 'చీడపురుగులు' మాత్రమే మిగిలారని, వారిని కూడా త్వరలోనే బీజేపీ ఖతం చేస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల కుటుంబంతో రేవంత్ రెడ్డి కమిషన్ల కోసం చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఉదయం నోటీసులు పంపడం, రాత్రికి కమిషన్లు మాట్లాడుకుని వదిలేయడం కాంగ్రెస్ నైజమని విమర్శించారు. అనేకమంది ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్లను టాపింగ్ చేశారని, ఈ వ్యవహారంలో వసూళ్లు పూర్తయ్యాకే కేసును సీబీఐకి అప్పగిస్తారేమోనని ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలో పులాంగ్ కబ్బాలపై ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జా లకు పాల్పడిన వారికి ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చినా. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ నేతలు ఆ కబ్జాలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లాలోని ముస్లిం ప్రాంతాలు గత ప్రభుత్వంలో గానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గానీ ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. ముస్లింలు మతపరంగా కాకుండా అభివృద్ధిని కాంక్షించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎంఐఎం నేతలు ఐదేళ్లకోసారి చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారని ఎద్దేవా చేశారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఆయన తప్పుబట్టారు. నిజామాబాద్ పేరును 'ఇందురు'గా మార్చడంపై ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. ''రజాకార్లతో చేతులు కలిపి మహిళలను హింసించి, పసిపిల్లలను రెండు ముక్కలు చేసిన నిజాం పేరు మనకెందుకు'' ఈసారి 100 శాతం నిజామాబాద్ పేరు మార్చి తీరుతామన్నారు. దీనిపై కనీసం ఒక్కసారి కూడా గెలవని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.355 కోట్ల నిధులతో అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ పనులు చేపడితే, కంటికి కనిపించే పురోగతి ఎక్కడని ఎంపీ ప్రశ్నించారు. 'మొత్తం 42 వేల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటే, కనీసం 400 కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రతి సమావేశంలో అదే పాత సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. స్టాఫ్ లేరు, వర్కర్లు లేరనే కుంటి సాకులు చెబుతారా?' అని అధికారులను నిలదీశారు. దీనిపై కొత్త కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, నెల రోజుల్లో మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుల చారి, నాయకులు పాల్గొన్నారు.

“



లోక్‌సభ సభ్యుల అటెండెన్సును వారు సభలో కూర్చున్నప్పడే తీసుకోనున్నాం. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు హౌస్ బయట హాజరు వేసే విధానాన్ని రద్దు చేస్తున్నాం. అలాగే సభ ముగిసిన, ఏదైనా కారణంతో అర్థాంతరంగా వాయిదా పడిన తర్వాత హాజరు వేయడానికి వీల్లేదు. హాజరు నమోదుకు సభ్యుల సీట్ల వద్ద కన్సోల్ పరికరాలు ఏర్పాటు చేశాం.

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా బాధ్యతగా పనిచేయాలి

- అసాంఘిక కార్యకలాపాలు డ్రగ్స్, గంజాయి, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పోలీస్ అధికారుల నెలవారి సమీక్ష సమావేశంలో సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 20 :



రాబోయే మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోలీస్ అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నియమావళిని అనుసరించి పటిష్టమైన ప్రణాళికను తయారు చేసుకోవాలని తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కార్యాలయంలోనిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో సీపీ మంగళవారం నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారిచేసారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ర్యాలీలు , సభలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరని , ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని తెలిపారు.పెండింగ్లో ఉన్న (అండర్ ఇన్వేస్టిగేషన్) కేసులలో గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ మరియు నాన్ గేవ్ కేసులలో ఇన్వేస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతీకేసులలో క్వాలిటీ ఇన్వేస్టిగేషన్తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జ్షీటు వరకు ప్రతి విషయాన్ని కూలంకుశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అని తెలిపారు. పోక్సో,గ్రేవ్ కేసులలో త్వరితగతిన ఇన్వేస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేయాలి అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందజేస్తూ సత్వరన్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. గ్రామ పోలీస్ అధికారులు (వి.పి.ఓ) ప్రతీ రోజు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకంమవుతు నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సి.సి కెమెరాల ప్రాముఖ్యత అవగాహణ కల్పిస్తూ కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్ , డయల్ 100 వాటి వినియోగం పై విద్యార్థులకు ప్రజలకు అవగాహణ కల్పించాలని అన్నారు. హైవే రోడ్డులను కలుపుతు ఉండే లింక్ రోడ్లకు స్పీడ్ బ్రేకర్స్ వేయించడం రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధంగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే స్టేట్ హైవే అథారిటి ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి , ఇతర మాదకద్రవ్యాల అక్రమరవాణ క్రయవిక్రయాల పైన, జూదం , పి.డి.యస్. రైస్ అక్రమ రవాణలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిపిటెడుగా ఇలాంటి నేరాలకు పాల్పడేవారి పై పీడీ యాక్టు కోసం పంపాలని ఆదేశాలు జారిచేశారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి , నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఏసీపీ వై. వెంకటేశ్వర్ రావు , సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ అంజయ్య, నిజామాబాద్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, ఐటి కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 20

మంచిర్యాల జిల్లా కేంద్రంలో కాలేజీ రోడ్డులో గల గోదావరి సమీపంలో గౌతమేశ్వర ఆలయం పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్నసమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లు జాతర కమిటీ సభ్యులు మున్సిపల్ సిబ్బంది పోలీస్ మంగళవారం జాతర ఏర్పట్ల విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకొని ఉన్నారు జాతర వచ్చే భక్తులకు ఎటువంటి కాటంకాలు జరగకుండా గోదావరి లోపల వరకు ప్రత్యేకమైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగల సైతం ఏర్పాటు చేశారు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి రాత్రి వేళలో వెలుతురు ఉండే విధంగా తగు చర్యలు తీసుకున్నారు వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయుటకు భక్తులు వచ్చి పోయే దారులలో విశాలంగా ఉండాలని తగు సూచనలు చేశారు వ్యాపార సముదాయాలు రోడ్డుకు ఇరువైపులా ఇరుకుగా కాకుండా దూరముగా ఏర్పాటు చేయాలని సూచించారు ప్రతి ఏటా లక్షలాదిమంది సమ్మక్క జాతరకు రావడం వల్ల శానిటేషన్ నూతనశాలలు శుభ్రం చేసి పిచ్చి మొఖం తొలగించారు ఈనెల 28 నుండి 31 వరకు సమ్మక్క సారక్క జాతర ఏర్పడి కోసం వివిధ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తగు చర్యలు తీసుకొని ఉన్నారు సమ్మక్క సారక్క గద్దెలకు ప్రత్యేకమైన రంగులను దిద్దనన్నారు ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు మున్సిపల్ సిబ్బంది మంచిర్యాల సీఎం

బీఆర్ఎస్‌లోకి మాజీ మున్సిపల్ చైర్మన్?

- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీసీ నాయకుడు చేరికతో ప్రజల్లో చర్చ

ప్రతిపక్ష ప్రతినిధి మెదక్ జనవరి 20



మెదక్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ మార్పులు జరుగుతున్నాయి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తమను పట్టించుకోవడం లేదంటూ మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కొండన్ సావిత్రి సురేందర్ గౌడ్ తో పాటు కొంతమంది కాంగ్రెస్ నేతలు పార్టీని వీడి బిఆర్ఎస్ లో చేరుతున్నట్లు మెదక్ లో జోరుగా ప్రచారం కొనసాగుతుంది. మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో సురేందర్ గౌడ్ తన అనుచరులతో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు గురువారం ముహూర్తం ఖరారైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.2000 సంవత్సరంలో సంవత్సరంలో మున్సిపల్ ఎన్నికల లో బిసి మహిళ చైర్పర్సన్ గా గెలుపొందిన సావిత్రి సురేందర్ గౌడ్. సుమారు 26 సంవత్సరాల తర్వాత మెదక్ మున్సిపల్ చైర్మన్ బీసీ మహిళలకు కేటాయించడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ తరపున సావిత్రి సురేందర్ గౌడ్ చైర్మన్ అభ్యర్థిగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి సావిత్రి సురేందర్ గౌడ్ పార్టీని వీడడంపై ఆసక్తికరమైన పరిణామాలు జరుగుతున్నాయి. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ను గెలిపించేటప్పుడు కీలక పాత్ర వహించిన తనను పట్టించుకోవడం లేదంటూ కనీసం మాట్లాడటం కైనా మొహమాటపడటంతో విరక్తి చెందిన సురేందర్ గౌడ్ మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరాలని పరోక్షంగా ఎమ్మెల్యేకు షాక్ కలుగుతుందని చెప్పడం గమనార్హం.

పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్న బిఆర్ఎస్

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా భారత రాష్ట్ర సమితి బలంగా ఉన్న నేపథ్యంలో మెదక్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కేవలం చేసుకున్నది దీంతో తిరిగి పూర్వ వైభవం తీసుకురావడం కోసం మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కృషిచేస్తున్నాడు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరాలని దీని కోసం కార్యకర్తల తో నాయకులతో పలుసార్ల సమావేశాలు నిర్వహించాడు. భారత రాష్ట్ర సమితి గులాబీ జెండా ఎగరడం కోసం మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ పై బాధ్యతలు ఉంచి గతంలో మున్సిపల్ ఎన్నికలలో ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎవరు పనిచేశారు వార్డులలో ఎవరికి పట్టు ఉంది అని నేపథ్యంలో ఒకరికి ముగ్గురు చొప్పున కార్యకర్తల తో సమావేశాలు జరిపి వార్డులలో ఎంక్వయిరీ మొదలుపెట్టారు వార్డు కౌన్సిలర్ గతంలో పనిచేసిన వారికి సిటింగ్ సీట్లను అప్పజెప్తూ గెలవాలని వారికి సలహాలు సూచనలు ఇస్తూ పార్టీని బలోపితం చేస్తున్నారు. కాంగ్రెస్ నుండి మాజీ చైర్మన్ సావిత్రి సురేందర్ గౌడ్ తోపాటు కార్యకర్తలు నాయకులు చేరికతో బిఆర్ఎస్ మరింత బలపడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు..

రాజకీయాల్లో నిలకడ లేని మనస్తత్వం సురేందర్ గౌడ్ ది

మెదక్ మున్సిపల్ లో కీలక పాత్ర వహిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సావిత్రి సురేందర్ గౌడ్ కేవలం ఎన్నికల నేపథ్యంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటాడని అటు తర్వాత ప్రజలను పట్టించుకునే పాపాన ఉండదని రాజకీయ విశ్లేషకులు ప్రజలు చెబుతున్నారు ఒకరకంగా చెప్పాలంటే సురేందర్ గౌడ్ నిలకడ లేని మనస్తత్వం అని వారి అభిప్రాయం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సాయి శక్తులకు చేసిన సురేందర్ గౌడ్ ఆ తర్వాత పట్టణ అభివృద్ధిలో గాని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఏ కార్యక్రమంలో ఆయన పాల్గొనలేదు ప్రభుత్వం నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తిరిగి ప్రజల్లోకి వచ్చి పార్టీ మారుతున్నట్లు ప్రచారం కొనసాగిస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ బిసి మహిళా గా చైర్మన్ ను ఇతరులకు ఇవ్వడంతో సురేందర్ గౌడ్ నిరాశతోనే పార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. నిత్యం ప్రజా కార్యక్రమాలలో ఉంటూ పార్టీ కార్యక్రమాలు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్న బీసీ మహిళకు చైర్మన్ గా ఇవ్వడంతోనే అది జీర్ణించుకోలేని మాజీ చైర్మన్ సావిత్రి సురేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీని వీడి భారత రాష్ట్ర సమితి లోకి చేరుతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు...

మెదక్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులలో నిరాశ

మెదక్ మున్సిపల్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మెదక్ పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్గా పోటీ చేయాలనుకున్న నాయకులు నిరాశతో ఉన్నారు. మెదక్ జిల్లా ఎన్నికల అధికారి మున్సిపల్ ఎన్నికలను వార్డ్ రిజర్వేషన్ ప్రకటించినప్పటికీ మెదక్ కాంగ్రెస్ పార్టీలో ఎవరికి టికెట్ ఇస్తారు ఎవరు పని చేయాలి అనే అమాయంలో ఉన్నారు కార్యకర్తలకు నాయకులకు ఎవరిని అడగాలో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది పట్టణ నాయకత్వం లేకపోవడంతో కార్యకర్తలు నిరాశ తీసుకోవాలతో ఉన్నారు స్థానిక ఎమ్మెల్యే మైనాపల్లి రోహిత్ టికెట్ విషయం కార్యకర్తలు అడిగినప్పటికీ వార్డులలో ఎంక్వయిరీ జరుగుతుందని చెప్పడం కానీ ఎంక్వయిరీ ఎవరు చేస్తున్నారు అనేది ఇప్పటివరకు తేలని విషయము అందుకే మాజీ చైర్మన్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు సమాచారం.



సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ హైమావతి
- గజ్వేల్‌లో ఇందిరా మహిళ శక్తి సంబరాలు
- మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

ప్రతిపక్షం,గజ్వేల్, జనవరి 20:

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు మహిళల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగంగా గజ్వేల్ ఐఓసీ ప్రాంగణంలో మంగళవారం గజ్వేల్ పట్టణ మహిళలకు కలెక్టర్ హైమావతి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలలో మహిళలే కేంద్ర బిందువుగా ఉన్నారని స్పష్టం చేశారు.గజ్వేల్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా, జిల్లా మొత్తంగా 12,500 ఇండ్లకు అనుమతులు లభించాయని తెలిపారు. వాటిలో 90 శాతం గ్రౌండింగ్ పూర్తి కాగా, 80 శాతం లబ్ధిదారుల ఖాతాల్లో ఆయా దశలలో ప్రభుత్వం నిధులు జమ చేసిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియతో పాటు పాత కార్డుల్లో సభ్యుల చేర్పు కొనసాగిస్తోందని, పేదలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రైతు భరోసా పథకం కింద జిల్లాలో రైతుల ఖాతాల్లో రూ.390 కోట్లను జమ చేసినట్లు వెల్లడించారు.గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం చేసే గృహాలకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని, గజ్వేల్ అర్బన్ పరిధిలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.1 కోటి 28 లక్షలను అందజేశామని తెలిపారు.ఇందిరమ్మ చీరల పంపిణీ విషయంలో అపోహలు అవసరం లేదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల మహిళకు చీరలు అందజేస్తామని స్పష్టం చేశారు. కేవలం గ్రూపుల్లో ఉన్నవారికే చీరలు ఇస్తారనే అపోహలను నమ్మవద్దని చెప్పారు. వార్డు వారీగా అర్హులైన ప్రతి మహిళకు అధికారులు చీరల పంపిణీ చేస్తారని, మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఏఎంసి చైర్మన్ నరేందర్, పిడి మెప్మా హనుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలకిషన్, తహసిల్దార్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి దేవస్థానానికి పల్లె కవితా వంశీకృష్ణ గౌడ్

ప్రతిపక్షం దుబ్బాక, జనవరి 20:

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి పల్లె కవితా వంశీకృష్ణ గౌడ్ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని దేవస్థానం కమిటీ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు పల్లె వంశీకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, కోరిన మొక్కులు తీర్చే వీరాంజనేయ స్వామి దేవస్థానం గొప్ప ప్రతిష్ట కలిగిన క్షేత్రమని తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, ప్రహరీ గోడ నిర్మాణం, నిత్యాన్నదానం, వంటశాల ఏర్పాటు వంటి పనులకు సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేలేటి జయరామ శర్మ, రామకృష్ణ శర్మ, కమిటీ సభ్యులు చింత నాగేందర్, చింత కృష్ణమూర్తి, అజ్జ రాజ్ కుమార్, కాల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 20:

దళితులపైదాడి చేసిన నిందితులపై ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ డిమాండ్ చేశారు . ములుగు మండలం కొత్తూరు లో దాడి గురైన దళితులను మంగళవారం నాడు ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరులో మట్టి తరలింపు వల్ల వస్తున్న దుమ్ముతో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయానికి నష్టం అవుతున్నందున లారీలు నెమ్మదిగా పోవాలని అడిగిన పాపానికి 30 మంది ముదిరాజులు ఉప సర్పంచ్ చింతల రవి నాయకత్వంలో దాడి చేశారన్నారు.ఈ నెల 17న దాడి జరిగినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష వహించడం తగదన్నారు. స్థానిక ఎస్సై కేసును రాజి చేయడానికి రాజకీయ నాయకులతో ప్రయత్నించడం మానుకోకపోతే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం సెక్షన్ 4 కింద అధికార దుర్వినియోగం కింద కేసు నమోదు చేయాల్సిస్తుందని తెలిపారు . సిద్దిపేట పోలీసులకు దళితులపై దాడులు జరిగిన సమయంలో నిర్లక్ష్యం వహించడం అలవాటుగా మారిందని ఈ నిర్లక్ష్యాన్ని మార్చుకోవాలని కోరారు. అనంతరం ములుగు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్సై రఘుపతి తో సమావేశమై దళితులపై దాడులు చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు అంబేద్కర్ సంఘం నాయకులు కర్రె మహేష్, ఎంఆర్పిఎస్ గ్రామ అధ్యక్షుడు కర్రే నర్సింలు, కోల శేఖర్, లంబ రమేష్, ఎల్లారావు, దాసు, ఎల్ల స్వామి దళిత నాయకులు గజ్వేల్ రామచంద్రం పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందు కె ఫోన్ ట్యాపింగ్ కేసు

- గజ్వేల్ మాజీ జెడ్పిటిసి మల్లేశం

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 20:



రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందునే మాజీ మంత్రి హరీష్ రావు పై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నట్లు గజ్వేల్ మాజీ మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు హరీష్ రావుకు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో సిట్ ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ కేసులను చూసి తెలంగాణ ఉద్యమ కారులు భయపడతారని అనుకుంటే అది వారి అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం రాజకీయ ప్రతీకార చర్యలు తప్ప పేదల సంక్షేమం మర్చినట్లు విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అవినీతి పేరుకుపోగా, సీఎం రేవంత్ రెడ్డి సమైక్యవాదుల చేతుల్లో కీలుబొమ్మగా మారినట్లు ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలపై కేసులు కాంగ్రెస్ దివాళా రాజకీయానికి అద్దం పడుతుండగా, ప్రజలే తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. బొగ్గు గనుల్లో కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు బహిర్గతం చేసిన రోజునే హరీష్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు.

హరీశ్‌రావుపై నోటీసులు రాజకీయ కక్షే..

- బీఆర్ఎస్ యువ నాయకులు సాయి ప్రేమ్ సామల్ల

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 20:



మాజీ మంత్రి హరీష్ రావు పై తప్పుడు కేసులు, నోటీసులు జారీ చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ రాజకీయ కక్షపూరిత చర్యలని బి ఆర్ ఎస్ యువ నాయకులు సాయి ప్రేమ్ సామల్ల విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పస లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ మళ్లీ నోటీసులు ఇవ్వడం డైవర్షన్ పాలిటిక్స్‌కేనని అన్నారు. ప్రజల పక్షాన హరీష్ రావు పోరాటం ఎలాంటి కేసులతోనూ ఆగదని స్పష్టం చేశారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

- ఎర్రబోలు రాజారెడ్డి సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 20:

ఇటీవల మరణించిన సిద్దిపేట మున్సిపాలిటీ 2 వ వార్డ్ నర్సాపూర్ కు చెందిన మోత్కూరు రాజవ్వ కుటుంబానికి ఎర్రబోలు రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున వారి కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని,ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఇందులో నర్సపూర్రెండవ వార్డ్ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యువజన కాంగ్రెస్ నాయకులు మిత్రులు పాల్గొన్నారు.

మహిళల గౌరవం పెరిగేలా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టింది

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం దుబ్బాక, జనవరి, జనవరి 20:



మహిళల గౌరవం పెరిగేలా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.మంగళవారం దుబ్బాక ఐఓసీ లో ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగంగా దుబ్బాక పట్టణంలోని మహిళలకు జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం మహిళలను దృష్టిలో పెట్టుకొని వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే వారి గౌరవం పెరిగేలా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. ఇదే ఐఓసీ కార్యాలయంలో గతంలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం జరిగిందని ఇప్పుడు దుబ్బాక పట్టణంలోని మహిళలకు 11105 చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 26వేల కొత్త రేషన్ కార్డులను ఇవ్వడమే కాకుండా పాత రేషన్ కార్డుల్లో 79 వేల పేర్లను అదనంగా చేర్చి లబ్ధి చేకూర్చడం జరిగిందని అన్నారు. ఉచిత బస్ కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయల విలువైన ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారని తెలిపారు. సొంత ఇంటిలో నివసించాలనేది ప్రతి ఒక్కరి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో ఆ కల నెరవేరుతుందని తెలిపారు. ఇండ్లు లేని వారందరికీ సొంత ఇంటి అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని, దుబ్బాక నియోజకవర్గంలో మొదటి విడుదల 3500 ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని , రానున్న ఏప్రిల్ నెలలో రెండో విడతలో మరో 3500 ఇండ్లను అర్హులైన వారికి అందించడం జరుగుతుందని, జిల్లావ్యాప్తంగా 12,500 మంజూరు చేయడం జరిగిందని ఇప్పటికే 80 శాతం ఇండ్ల నిర్మాణం గ్రౌండింగ్ జరిగిందని ఆయా స్థాయిలో డబ్బులు కూడా వారి అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. జిల్లాలో రైతు భరోసా కింద 390 కోట్ల రైతుల ఖాతాలో జమ చేశారన్నారు.గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు గృహాలకు ఉచిత కరెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.వడ్డీలేని రుణాలు దుబ్బాక పట్టణంలో 1 కోటి 26 లక్షల ఆయా గ్రూపులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ చీరలు పంపిణీ పట్టణంలో 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరకు హర్హులే అని గ్రూపులో ఉన్నవారికి మాత్రమే ఇస్తారనే అపోహ వద్దని తెలిపారు.మీ వార్డుల వారీగా అర్హత గల ప్రతి మహిళలకు అధికారులు చీరలను పంపిణీ చేస్తారని వార్డు మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.ప్రభుత్వం అందించే అన్ని పథకాలను స్వీకరించి మహిళలకు ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా లబ్ది పొందాలని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, దుబ్బాక ఏఎంసి చైర్మన్ కొంగర రవి, అడిషనల్ డిఆర్డిఓ సుధీర్, పిడి మెప్మా హనుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, తహసిల్దార్ సంజీవ్ కుమార్ ,ఎంపీడీవో భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నన్ను ప్రశ్నలడగడం కాదు.. నేనే వాళ్లను చాలా ప్రశ్నలు అడిగా. ఫోన్ ట్యాపింగ్‌తో నాకేంటి సంబంధం. నేను హోంమంత్రిగా చేయలేదు కదా. అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను అడగండి. సిట్టు, లట్టు, పొట్టుకు మేం భయపడం. నాకు సిట్ నోటీసు ఇవ్వడం కాదు. సీఎం రేవంత్‌కు ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి.

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రాంతీయం



ట్రాన్స్‌జెండర్లకు 'మైత్రి' చికిత్స

- ప్రతి విద్యార్థి ఐదుగురు ట్రాన్స్‌జెండర్ల దత్తత

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 20:

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న ట్రాన్సజెండర్ లకు మైత్రి చికిత్స పేరిట వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వ మెడికల్ కళాశాల డా, దేశం పేర్కొన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ విమల తామస్, సుపరెండెంట్ సంగీత, డా సదానందం ఆదేశాలతో మంగళవారం ఇందిరమ్మ కాలనిలో వారి నివాసలా వద్దే వైద్య క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా దాదాపు 200 మంది ట్రాన్సజెండర్ లకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ట్రాంజెండర్ లను సమాజంలో చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. వారు ఆత్మన్యుతతో చికిత్స తీసుకోవడనికి ఆసుపత్రి కి రావడానికి జంకుతున్నారని తెలిపారు వారి కోసం ప్రత్యేకంగా వారి ఇంటి వద్దనే వైద్ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న చేస్తున్న ప్రతి వైద్య విద్యార్థి 5 గురు ట్రాం జెండార్లను ఆడాప్ట్ చేసుకొని వైద్యం అందిస్తున్నమన్నారు. వరికి రక్త పరీక్షలతో పాటు లివర్ ఫంక్షనింగ్ తో పలు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ట్రాన్సజెం డర్ అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ సమాజంలో తాము ఎదుర్కొంటున్నా వివక్ష కు ఇలాంటి కార్యక్రమాలు తమ విశ్వసాన్ని పెంచుతాయాన్నారు. సిద్దిపేటలో ఉన్న దాదాపు 200 మంది ట్రాన్సజెండర్ కు వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. డా, దేశం, డా, నిహారిక కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాంజెండర్స్ కరిష్మా, నీరజ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగి సర్పంచ్‌కు గౌడ సంఘం ఘన సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి20:

నార్సింగి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ ను గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గౌడ సంఘం నాయకులు సర్పంచ్ భార్య భర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నిరంతరంకు చేయాలని కోరారు . గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి ప్రజల్లో మమేకమై మసలుకోవాలని వారు పిలుపునిచ్చారు . దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్ని పార్టీల అండదండలతో ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాభివృద్ధి సాధిస్తానని సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ హామీ ఇచ్చారు.

కూడవెల్లి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న 'భక్తిరత్న'

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 20:



దక్షిణ కాశిగా విరాజిల్లుతున్న కూడవెల్లి గ్రామంలోని శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామిని మంగళవారం నాడు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు దంపతులు దర్శించుకున్నారు. ఆలయం అర్చకులు సాకేత్ శర్మ ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ ఇక్కడ శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్టించారని ప్రతీతి. అందుకే రామలింగేశ్వర క్షేత్రంగా భక్తులు పిలుస్తున్నారన్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా భక్తులు కొల్చుకుంటున్నారన్నారు. అనంతరం ఆలయం కమిటీ చైర్మన్ ఊషయ్యగారి రాజిరెడ్డి రామకోటి రామరాజును దేవాలయంలో ఘనంగా సన్మానించారు.



మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై 5 రోజుల శిక్షణ..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 20:

సిద్దిపేట జిల్లా ఎన్‌జీఓ భవనంలో మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి మాట్లాడుతూ...జిల్లావ్యాప్తంగా 15 క్లస్టర్ల నుండి ఇద్దరు మహిళా రైతులను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, ఖర్చులు తగ్గిస్తూ లాభదాయకమైన సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మహిళా రైతులకు అవగాహన పెరిగి, గ్రామీణ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం విస్తరించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ సైంటిస్ట్ సతీష్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి డిఆర్డిఏ ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్ వైస్ చైర్మన్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..

- రాష్ట్ర జెఏసి కన్వీనర్ ఎం.డి. మౌలానా
- టిజిఎస్ ఆర్టీసీ రాష్ట్ర జెఏసి పిలుపుతో సిద్దిపేట డిపోలో పోరాట దినం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 20:

టిజిఎస్ ఆర్టీసీ రాష్ట్ర జెఏసి పిలుపు మేరకు సిద్దిపేట డిపోలో ఆర్టీసీ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి తొలి బస్సు నుంచే "పోరాట దినం"ను పాటించారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జెఏసి కన్వీనర్ ఎం.డి. మౌలానా మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే టికెట్ తీసుకునే పూర్తి బాధ్యత ప్రయాణికులదే ఉండాలని, 2021, 2025 వేతన సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం స్వయంగా కొనుగోలు చేసి ఆర్టీసీకి అందించాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధనకై రాష్ట్ర జెఏసి ఇచ్చిన పిలుపును విజయవంతం చేసినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే మరింత తీవ్ర పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జెఏసి నాయకులు ఎన్. మల్లేశం, బి.ఎస్. గౌడ్, ఎన్. రాజయ్య, కె.ఎం. రెడ్డి, ఏ. రాజేందర్, ఎన్.పి. రాములు, జి. బాలు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో ఫేజ్-2కు వీలైనంత త్వరగా అనుమతులు ఇప్పించాలి. ఇదే విషయమై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌నూ కలిశాం. ఫేజ్-2 నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఇద్దరు అధికారులతో కూడిన సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలి.
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖలో సీఎం రేవంత్

బీజేపీ కార్యాలయం పై జెండా ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 20 :



భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడి గా నితిన్ నబిన్ నియమితులైన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఇందూర్ జిల్లా బీజేపీ కార్యాలయం పై జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎంపీ అర్వింద్ ధర్మపురి మాట్లాడుతూ బీజేపీ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం కేవలం 45 ఏళ్ల వయసులోనే, అత్యంత పిన్న వయస్కుడైన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించడం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది యువ కార్యకర్తలకు నూతనోత్సాహాన్ని నింపిందన్నారు. ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం మొదలుపెట్టి, యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీజేవైఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. బీహార్‌లో 5 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఆపై ఛత్తీస్‌గఢ్ ఎన్నికల సహఇన్‌చార్జిగా వారు చూపిన పనితనం అద్భుతమన్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో వారి వ్యూహాత్మక నాయకత్వమే పార్టీకి ఘన విజయాన్ని అందించింది. క్షేత్ర స్థాయిలో పార్టీని ఎలా బలోపేతం చేయాలో వారికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. దేశంలో ఒకవైపు వారసత్వ రాజకీయాలు, కుటుంబ పార్టీలు రాజ్యమేలుతున్న తరుణంలో కేవలం పనితనం, చిత్తశుద్ధి ప్రామాణికంగా ఒక సామాన్య కార్యకర్తను జాతీయ అధ్యక్షుడిని చేయడం ఒక్క బిజెపికి మాత్రమే సాధ్యమన్నారు. కాంగ్రెస్ సహా ఇతర ప్రాంతీయ పార్టీలలో అధ్యక్ష పదవి కావాలంటే ఆ కుటుంబంలో పుట్టాలి. భారతీయ జనతా పార్టీలో మాత్రం పార్టీ జెండాను భుజాన మోసిన సామాన్య కార్యకర్త కూడా, పార్టీ పగ్గాలు చేపట్టే స్థాయికి ఎదగగలడని నితిన్ నబిన్ నియామకం మరోసారి నిరూపించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 'వికాసిత్ భారత్' కలను సాకారం చేయడంలో నితిన్ నబిన్ యువ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, పోతన్ కార్ లక్ష్మీనారాయణ, నగ్గొల్ల లక్ష్మి నారాయణ, న్యాలం రాజు, బద్దం కిషన్, ఇప్పాకాయల కిషోర్, గడ్డం రాజు, ఆనంద్ రావు. తరుణ్ వేణు, కోడూర్ నాగరాజు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునర్ధరించాలి

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష
- గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసినా ఎమ్మెల్యే

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 20 :



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మహాత్మా గాంధీ మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చవద్దంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద నిర్వహించిన దీక్ష లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు రాంజీ అని పేరు మార్చవద్దని సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ పేరు మార్చడం బీజేపీ ఆలోచన సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తు గ్రామపంచాయతీలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన అధికారులను నిర్వేదం చేస్తుందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ భారత్ గారెంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ చట్టం గ్రామీణ ప్రజల జీవితాలకు తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని ఈ చట్టం ద్వారా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రమాదకర విధాన మార్పులకు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని అయినా తెలిపారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గ్రామీణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రజలకు ఉపాధి దొరకాలని ఉద్దేశంతో కొద్దిరోజుల గ్రామీణ ప్రజలకు వందరోజుల పనిని కల్పించడం జరిగిందని దీంతో ప్రజలకు జీవనోపాధి కింద కొత్త ఆర్థిక సాయం అందుతుందని కానీ నేడు కేంద్ర ప్రభుత్వం 100 రోజుల పనిని 50 రోజులుగా చేస్తూ యంత్రాలతో పని చేయించుకునే చట్టాన్ని తీసుకురావడంతో గ్రామీణ కూలీలకు పని దొరకకుండా తీవ్రంగా నష్టపోతారని అలాగే ఈ దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీ పేరుని మార్చడం వెనుక కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్ర పన్నిందని ఆయన అన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు తదితరులు మాట్లాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ కన్వీనర్ గంగాధర్. మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అమర సేన రెడ్డి. సుప్రభాత్. చౌదరి శ్రీనివాస్ రావు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్. మాజీ కౌన్సిలర్లు లింగం లక్ష్మీనారాయణ గౌడ్ కాంగ్రెస్ నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు.

కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోండి: ఎమ్మెల్యే రోహిత్

మెదక్, రామాయంపేట పురపాలక సంఘాల్లో ఎన్నికల లో పోటీ చేయదానికి నేటి నుండి మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. ప్రతివార్డు నుండి ముగ్గురు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్టీ అధిష్టానం అన్ని కోణాల్లో పరిశీలించి టికెట్ ఖరారు చేస్తుందన్నారు. మెదక్, రామాయంపేట బల్దియా పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



వీరశైవ లింగాయత్ మండల అధ్యక్షుడిగా శేఖరప్ప

ప్రతి పక్షం, దౌల్తాబాద్, జనవరి 20:

వీరశైవ లింగాయత్ మండల నూతన అధ్యక్షుడిగా పట్నంశేటి శేఖరప్ప ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మాదంశెట్టి ఆనందం, ఉపాధ్యక్షుడుగా కంజర్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా కంజర్ల నాగేష్, సహాయ కార్యదర్శిగా ప్రసాద్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శేఖరప్ప మాట్లాడుతూ మండలంలో లింగాయత్ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లేశం, శ్రీనివాస్, శ్రీశైలం, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు....



జాతీయ, రాష్ట్ర రిపబ్లిక్ డే పరేడ్‌కు

తార ఎన్‌సీసీ క్యాడెట్లు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 20:

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ రిపబ్లిక్ డే పరేడ్‌కు తార కళాశాలకు చెందిన ఎన్సిసి క్యాడెట్ బి.చరణ్ రాజ్ ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర రిపబ్లిక్ డే పరేడ్‌కు నలుగురు ఎన్సిసి క్యాడెట్లు కే.వైశాలి, ఎన్.దశరథ్, వీ.రుక్మిణి, ఏ.రాజేశ్వరి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డా.ప్రవీణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



కర్నాల్ పల్లి రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ప్రతిపక్షం, చేగుంట, జనవరి20:



చేగుంట మండలం కర్నాల్ పల్లి రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అమ్మవారిని దర్శించుకున్నారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు గ్రామ పెద్దలు మైనంపల్లి హనుమంతరావు చెరుకు శ్రీనివాసరెడ్డి ఏఎంసీ చైర్మన్ వెంగళరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ 26వ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం భక్తులకు సంతోషం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేస్తున్నాం

- 10 యేండ్ల లో బీఆర్ఎస్ ప్రభుత్వం 50 సంవత్సరాల అభివృద్ధి చేసింది
- టిఆర్ఎస్ ప్రభుత్వంలోని అభివృద్ధి జరిగింది
- రాజ్యసభ సభ్యుడు కే ఆర్ సురేష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 20 :



భారతదేశంలో తెలంగాణ ను నెంబర్ వన్ స్థానానికి తీసుకు వచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అయితే నిజామాబాద్ ను తెలంగాణలో నెంబర్ వన్ స్థానంలో ఉంచిన ఘనత బిగల గణేష్ గుప్తకి దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు కే ఆర్ సురేష్ రెడ్డి అన్నారు. మంగళవారం బీ ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సురేష్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ లో చాలా అభివృద్ధి జరిగిందని, ప్రధానంగా రోడ్లు, సెంటర్ మీడియన్, మధ్యలో చెట్లు, నూతన మున్సిపల్ భవనం, నూతన కలెక్టరేట్, మోడ్రన్ స్మశాన వాటికలు ఎన్నో నిర్మించడం జరిగిందన్నారు. హైదరాబాద్ తరహాలో అండర్ గ్రౌండ్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం గణేష్ గుప్తకే సాధ్యమైందన్నారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరనుందని మేయర్ పీఠం బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల అన్నారు. నిజామాబాద్ అర్బన్ లో ఎక్కడ లేని విధంగా సెంటర్ మీడియన్లు ఏర్పాటు చేసి మధ్యలో చెట్లు నాటి ఎంతో సుందరంగా చేసిన ఘనత బీఆర్ఎస్ కే చెందుతుందన్నారు. మినీ ట్యాంక్ బండ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ హైదరాబాద్ తర్వాత అంతటి అభివృద్ధి నిజామాబాద్ లోచేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదని, తెలంగాణ రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిజామాబాద్ ను ఉంచడంలో ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. 10 సంవత్సరాల కాలంలో 70 ఏళ్ల చరిత్రని తిరగరాసి చూపించానని, అందులో మోడ్రన్ స్మశాన వాటికలు, అన్ని కులాలకు కళ్యాణ మండపాలు, సెంటర్ లైటింగ్, ప్రతి డివిజన్లో సిసి రోడ్ల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో కళాభారతి నిర్మాణం పనులు చేపట్టింది, తమ ప్రభుత్వమే దాన్ని ఆపినా ఘనత మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నో సంవత్సరాల సమస్య రైల్వే కమాన్ బ్రిడ్జి వద్ద నీళ్లు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొనే సమస్యను పూర్తిగా లేకుండా చేయడం జరిగిందన్నారు. ఖలీల్వాడిలోని మార్కెట్ నిర్మాణం, హైమది బజార్, నూతన మున్సిపల్ భవనం కట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వమే నని అన్నారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో 10 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందన్నారు. పట్టు వదలని విక్రమార్కుడిలా గణేష్ గుప్తా అండర్ గ్రౌండ్ పనులు పూర్తి చేశారని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్, మార్కెట్ల నిర్మాణాలు, కళాభారతి నిర్మాణాలు చేపట్టడం ఇప్పటికీ అదే అభివృద్ధి కనబడుతుంది తప్ప ఈ రెండు సంవత్సరాల కాలంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి లేదని, ఉంటే చూపాలని అన్నారు.

బీఆర్ఎస్ లో చేరికలు...

మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల గారి ఆధ్వర్యం లో పార్టీ లో 20 వ డివిజన్ నుండి నిజామాబాద్ మేస్త్రి సంఘం అధ్యక్షుడు పెంచాల వేణు, పెంచాల శ్రీనివాస్ శ్రీలత, మహేష్, 36వ డివిజన్ నుండి రిపోర్టర్ దువ్వ వెంకట్ పార్టీ లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విజీ గౌడ్, నగర మాజీ మేయర్ దండు నీతుకిరణ్, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్, శేహజాద్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 20



రాబోయే వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా వ్యాప్తంగా పంప్ సెట్లు, పనిచేస్తున్న బోర్‌వెల్‌ల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. మైనర్ రిపేర్ల కోసం చెక్‌లిస్ట్ తయారు చేసి గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాలలో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ బోర్లు, ఇతర నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా జాయింట్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించి సమస్యలు ఉత్పన్నం కాకముందే పరిష్కరించాలని స్పష్టం చేశారు. లెస్ ప్లాస్టిక్,లెస్ పేపర్,లెస్ పవర్ ను సమర్థవంతంగా అమలు చేయాలి,ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని,కార్యాలయాల ఫైల్స్ అన్ని ఈ ఆఫీసు లో ఉండాలని,ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం తగ్గించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,డి ఆర్ ఓ భుజంగ రావు, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి,జిల్లా అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మండల పరిషత్ అధికారులు, హౌసింగ్ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో రాష్ట్రకూటుల
నాటి నాగ బోన శిల్పం

- అయిదు తలల నర నాగదేవతతో కుంభం చెక్కిన శిల్పం
- గుర్తించిన తెలంగాణ కొత్త చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 20:



బోనం తెలంగాణ ఆచార, సంప్రదాయాలకు చెందినది. బోనం ఎత్తడం పోచమ్మ, కాటమయ్యలకే కాదు నాగుల బోనం కూడా ఉండేదని తెలిపే ఆధారాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో గుర్తించారు. కొలిపాక శ్రీనివాస్ తన పరిశోధనలో భాగంగా రాష్ట్రకూటుల కాలానికి చెందిన నాగ బోన శిల్పాన్ని గుర్తించాడు. బట్టి తెలంగాణ ప్రాంతంలో ప్రత్యేకంగా నాగుల బోనం ఉండేదని ఈ శిల్పం వల్ల తెలుస్తున్నది. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలో సమ్మక్క గద్దెల సమీపంలో నిలిపిన మొక్కుబడి నాగ శిలల్లో ఈ శిల్పాన్ని గుర్తించినట్లు కొలిపాక శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. వీటిలో ఒక్కొక్క స్తంభానికి నలువైపులా అయిదు పడగలతో నర నాగ దేవతలను చెక్కి ఉన్నాయి. వీటిలో ఒక స్తంభంపై ఐదు పడగల నర నాగ దేవత కింద కుంభాన్ని చెక్కారు. చెక్కినట్లు కనిపిస్తున్న కుంభమే నాగ బోనం. ఈ శిలలు అనే ఉబ్బెత్తు శిల్పాలే. అన్నీ నర నాగ శిల్పాలే. శైలిని బట్టి ఈ నాగ శిలలు రాష్ట్రకూటుల కాలానికి చెందినవని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ తెలిపారు. ఈ శిల్పాల్లో బోనం కనిపించడంతో నాగబోనం ప్రాచీనమైనదని అభిప్రాయపడ్డారు. మెదక్ జిల్లా వేల్పుగొండ శివాలయం గోడల మీద, కాకతీయుల కాలం నాటి శిల్పాలలో కొన్నిచోట్ల, పొట్లపల్లిలో కాటమయ్య శిల్పంలో బోనం ఎత్తుకున్న స్త్రీలు తలమీద కుండలతో కనిపించారు. ఇవన్నీ 'బోనం' సంప్రదాయాన్ని బలపరిచే చారిత్రక ఆధారాలని వివరించారు.



ఐద్వా జాతీయ మహాసభలను
జయప్రదం చేయండి

- బీరంగూడలో మహాసభల గోడపత్రిక విడుదల
- మహిళలపై కొనసాగుతున్న వివక్ష దాడులను ఖండించాలి
- సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నాయిని లలిత, సునీత

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 20 :

జనవరి 25 నుండి 28 వరకు నాలుగు రోజులపాటు హైదరాబాదులోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరుగుతున్న అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి నాయిని లలిత అధ్యక్షురాలు సునీత పిలుపునిచ్చారు. బీరంగూడ లో మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో,రాష్ట్రంలో మహిళలపై కొనసాగుతున్న వివక్ష,దాడులు, చట్టబద్ధంగా మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన,సుప్రీంకోర్టు నిర్దేశించిన సమాన పనికి సమాన వేతనం, వితంతు పెన్షన్లు,చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై మహాసభలో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. మద్యం అశ్లీలత వంటి సామాజిక మాధ్యమాలే మహిళలపై జరుగుతున్న దాడులకు కారణమని విమర్శించారు. ప్రభుత్వాలు వీటి కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 33% మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లో ఘోరంగా విఫలమైందని వెంటనే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.బిజెపి అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్రంలో, దేశంలో స్త్రీలపై సాంస్కృతిక దాడి ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని వ్యాఖ్యానించారు.చాలీచాలని వేతనాలతో ఏ రోజు కా రోజు గడుపుకుంటున్న పేద మహిళలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఐద్వా సంఘం జాతీయ మహాసభల ముందు రోజు 25న జరుగు బహిరంగ సభకు జిల్లాలోని ప్రతి గ్రామము నుంచి మహిళలు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.అనంతరం జెండా ఆవిష్కరణ చేసి, బెలూన్లను ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ నాయకులు సుజాత,పద్మావతి,లావణ్య, మల్లేశ్వరి,సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన రమేష్ కుమార్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ,జనవరి 20



ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హనుమకొండకు వచ్చిన సందర్భంగా మంగళవారం రోజున దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, దళిత-గిరిజనుల సమస్యలపై నిరంతర పోరాటం చేయాల్సిన అవసరం ఉందని రమేష్ కుమార్‌కు ఉద్బోధించారు. అలాగే విద్యుత్ సంస్థలో హెల్పర్ స్థాయి నుంచి ఇన్స్పెక్టర్ వరకు సుదీర్ఘకాలం సేవలందించినందుకు రమేష్ కుమార్‌ను అభినందించారు.ఈ భేటీ హనుమకొండలోని నక్కలగుట్ట ఏపీ ఎస్ ఈ బి గెస్ట్ హౌస్‌లో జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగను శాలువతో సత్కరించారు.



యశస్వి ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 20:

జాతీయ స్థాయి యశస్వి ఉపకార వేతనాలకు రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారని ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉప్పల హర్షిత, అందె మణిధీర్, నల్ల శ్రీవర్ష, నీలి నవ్యశ్రీ, కోల మనస్విని, బండి ప్రవీణ్ లు 202425 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి యశస్వి ఉపకార వేతనాలకు ఎంపిక అయ్యారని చెప్పారు. వారికి సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భముగా ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు అభినవ్, రాజు, సయ్యద్ షెహబాజ్, ఏవో శ్రీ రాజేష్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత

- మంత్రి దామోదర రాజనర్సింహ
- కళ్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.2.54 కోట్ల చెక్కులు పంపిణీ
- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 20:

ప్రజలకు సామాజిక, ఆర్థిక, వైద్య భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాలకు చెందిన 254 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ.2.54 కోట్ల విలువైన చెక్కులను మంత్రి, దామోదర్ రాజనర్సింహ , టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, పిల్లలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడానికి వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, బాల భరోసా, ప్రణామ వంటి కార్యక్రమాల ద్వారా పిల్లలు, వృద్ధులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు.సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, త్వరలో కంటి కాట్రాక్ట్ శస్త్రచికిత్సలు సహా అన్ని ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అడగకుండానే ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, కంది సర్పంచ్ శ్రీరామ్, ఆర్డీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 20:

సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సిద్ధిపేట జిల్లాలోని ఎస్.ఎస్. సి. విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణ చందర్ రావు తెలిపారు. మంగళవారం నంగునూరులో ఫోరం ప్రతినిధులతో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ అనుమతితో రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఫోరం సౌజన్యంతో పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లా , రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా 21వ తేదీన మండల స్థాయి, ఫిబ్రవరి 2వ తేదీన జిల్లా స్థాయి, ఫిబ్రవరి 7వ తేదీన రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వాస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిభా పరీక్షలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షులు సమ్మయ్య, అన్నపూర్ణ, ఆర్థిక కార్యదర్శి వై.రాంగోపాల్ రెడ్డి, వివిధ డివిజన్ల అధ్యక్షులు రాచకొండ భూపాల్, ఆంజనేయులు, ధర్మయ్య, నాగరాజు, చంద్రశేఖర్ ,నాయకులు రాదారి నాగరాజు, హేమలత, వివిధ మండల బాధ్యులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 20

గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.మెదక్ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు గాను శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. సమర్ధవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు.గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారికి సూచించారు. అగ్నిమాపక శకటం అందుబాటులో ఉండాలని ఫైర్ డిపార్ట్మెంట్ వారికి, అంబులెన్స్, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,అదనపు ఎస్పి మహేందర్, డి ఆర్ ఓ భుజంగ రావు, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

ప్రతిపక్షం, నంగునూరు జనవరి 20:



వృత్తి నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని జెడ్ పి హెచ్ ఎస్ నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీ టీ ఎఫ్ నంగునూరు మండల బాధ్యులు ఎనగందుల మనీష్ కుమార్, బండారు ప్రసాద్ రెడ్డి, ఎండి హర్షద్, లింగంపల్లి శ్రావణ్ పాల్గొన్నారు. వృత్తి నిబద్ధత సామాజిక బాధ్యత అనే నినాదంతో పనిచేస్తున్న డి టి ఎఫ్ సంఘము అనేక ఐక్య ఉద్యమాలతో ఎన్నో డిమాండ్లను సాధించారని మండల బాధ్యుడు ఎనగందుల మనీష్‌కుమార్ పేర్కొన్నారు.

యుద్ధం నివారించిన వాసవీ మాత

నంగునూరు, జనవరి 20:



యుద్ధం వద్దు శాంతి మార్గం ద్వారానే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ ఉదంతం రుజువు చేసిందని నంగునూరు వైశ్య సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మల్యాల భాస్కర్, ఇరుకుల్ల రాజు అన్నారు. మాఘ శుద్ధ విదియ రోజున శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని నంగునూరులోని ఆర్య విషయ సంఘం కార్యాలయంలో మంగళవారం వాసవీ కన్యకా పరమేశ్వరి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి మాతాను విష్ణువర్ధనుడు అనే రాజు పెళ్లి చేసుకునేందుకు దండ యాత్రకి సిద్ధం అయినపుడు వాసవీ మాత తండ్రి కుసుమ శెట్టి రాజు 102 గోత్రికుల పెద్దలతో సిద్ధం అవడంతో యుద్ధాన్ని నివారించేందుకు కన్యకా పరమేశ్వర ఆత్మార్పణ చేసుకుందని తెలిపారు. ప్రపంచం అంతా యుద్ధ వాతావరణం పోయి సోదర భావంతో ఉండాలని ఈ ఉదంతం చాటి చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం, మల్యాల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

- దిశా సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్
- పాల్గొన్న ఆర్మూర్, అర్బన్ ఎమ్మెల్యేలు, కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 20 :



ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయించేందుకు అధికారులు చొరవ చూపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పనుల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో జిల్లాలో వివిధ పథకాల కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఎం.పీ లాడ్స్ నిధులను మంజూరు చేసేందుకు పలువురు కమీషన్ లు డిమాండ్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఈ ధోరణిని మార్చుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎనలేని తాత్సారం జరుగుతోందని, అమృత్ పథకం కింద భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పనులు ఏళ్ళ తరబడి కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఈ పథకం పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఆర్.ఓ.బీ, ఆర్.యూ.బీ పనులను త్వరితగతిన జరిపించాలని, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల సంస్థ తదితర శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయించాలన్నారు.పీ.ఎం విశ్వకర్మ పథకం కింద అర్హులైన వారందరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని, ఈ పథకం అమలులో ద్వితీయ స్థానంలో ఉన్న నిజామాబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలని సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, నిజామాబాద్ నగర పాలక సంస్థకు చెందిన తిలక్ గార్డెన్ వాణిజ్య సముదాయాలలో బినామీలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, కార్పోరేషన్ కు నామమాత్రపు అద్దె సైతం సంవత్సరాల తరబడి చెల్లించడం లేదని, మడిగెలను సబ్ లీజ్ కు ఇచ్చి వేలాది రూపాయలు తీసుకుంటున్నారని అన్నారు. దీనిపై నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ వివరణ ఇస్తూ, ఈ అంశంపై సమగ్ర పరిశీలన జరిపామని, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని, అద్దె పెంపు, లీజు రద్దు ప్రతిపాదనలు కూడా పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. కాగా, పులాంగ్ వాగు నిర్వహణ గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఎక్కడికక్కడ కబ్జాలు జరుగుతున్నాయని సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. కబ్జాదారులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి, ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయించాలని ఎం.పీ అర్వింద్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, దిశా కమిటీ ఆశన్న, లింగం, విజయ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



'మన శంకర వరప్రసాద్ గారు' మూవీపై ప్రేక్షక దేవుళ్లు చూపిస్తున్న ఆదరణతో నా మనసు కృతజ్ఞత భావనతో నిండిపోతోంది. మీరు లేనిదే నేను లేను.
ఈ విజయం తెలుగు ప్రేక్షకులది. స్క్రీన్‌పై నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి పోతుంటాయి, కానీ మీరు నాపై చూపించే ప్రేమ శాశ్వతం. మూవీ టీంకు ధన్యవాదాలు.
- మెగాస్టార్‌చిరంజీవి

ప్రాంతీయం



ప్రకృతి ప్రేరణతో అద్భుత డిజైన్లు

- ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న ఐఐటీ హైదరాబాదు అధ్యాపకుడు డాక్టర్ ప్రభాత్ కుమార్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 20 : ప్రకృతి, భౌతికశాస్త్రం నుంచి ప్రేరణ పొందిన ఆప్టిమైజేషన్ సూత్రాలు తక్కువ ఖర్చుతో కూడుకున్న, సమర్థవంతమైన నిర్మాణ డిజైన్లకు దారితీస్తాయని ఐఐటీ హైదరాబాదులోని మెకానికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాత్ కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'టోపాలజీ ఆప్టిమైజేషన్: సిద్ధాంత, ఆచరణ' అనే అంశంపై మంగళవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఇంజనీరింగ్ డిజైన్, దాని సైద్ధాంతిక పునాదులు, ఆచరణాత్మక ఔచిత్యాన్ని డాక్టర్ ప్రభాత్ వివరించారు. ఏరోస్పేస్, ఆటోమోటివ్ ఇంజనీరింగ్ లో వాస్తవప్రపంచ వినియోగాన్ని కూడా ప్రస్తావించడంతో పాటు, తగ్గిన పదార్థ వినియోగం, తక్కువ కార్యాచరణ ఖర్చులు, మెరుగైన సౌందర్యం అవసరమన్నారు.ప్రఖ్యాత ఇంజనీర్ రాబర్ట్ లె రికోలైస్ ను ఉటంకిస్తూ, 'నిర్మాణ కళ అనేది రంధ్రాలను ఎక్కడ పెట్టాలో తెలుసుండాలని' డాక్టర్ ప్రభాత్ వ్యాఖ్యానించారు. ఇది నిర్మాణ పనితీరులో మెటీరియల్ లేఅవుట్, కనెక్టివిటీ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తుందని చెప్పారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి వడాల అతిథిని స్వాగతించి, సత్కరించారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ అక్తర్ ఖాన్ అతిథిని పరిచయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ నికుల్ జాని వందన సమర్పణ చేశారు.



ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, ఆటోమేషన్ పై శిక్షణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 20 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి 23 వరకు 'ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, ఆటోమేషన్' పై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో అధ్యాపకులు, విద్యార్థులు వాస్తవప్రపంచ సెన్సార్ ఇంటర్ ఫేసింగ్ ను ఆచరణాత్మకంగా నేర్చుకుంటున్నారు. స్మార్ట్ ఎనర్జీ మానిటరింగ్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ గేట్ వే సొల్యూషన్స్ వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేయడంలో ఈ నైపుణ్యాలను ఉపయోగిస్తారు. అంతేగాక, జాతీయ విద్యా విధానం 2023కు అనుగుణంగా పాఠ్యాంశాలను మెరుగుపరచడం, ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ఆవిష్కరణలపై నైపుణ్యంఆధారిత విద్యకు ఈ శిక్షణ ఉపకరించనుంది.బెంగళూరులోని పైటెక్ టెక్నికల్ మేనేజర్ గోపాల్, ఎంబెడెడ్ సాఫ్ట్ వేర్ డెవలపర్ హరీష్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ఈఈసీఈ అధ్యాపకులు, విద్యార్థులు ఇందులో చురుకుగా పాల్గొంటున్నారు.పైటెక్ డైరెక్టర్ అరుణ్ కుమార్ సింగ్, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి పర్యవేక్షణలో, డాక్టర్ పి.వి. రామకృష్ణ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



సాంఘిక శాస్త్ర ప్రయోగ శాలకు విశ్రాంత ఉపాధ్యాయుడి చేయూత

- వంద మంది జాతీయ నాయకుల చిత్ర పటాల అందజేత
- కోడూరి సుధాకర్ ఉదారత

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 20: సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు సామాజిక చైతన్యం ఎక్కువగా ఉంటుందని సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి అన్నారు. బక్రి చెప్యాల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంఘిక శాస్త్ర ప్రయోగ శాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు కోడూరి సుధాకర్ మంగళవారం వంద మంది జాతీయ నాయకుల చిత్ర పటాలను అందించారు. ఈ సందర్భంగా బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ కోడూరు సుధాకర్ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ వివిధ సామాజిక సమస్యలపై స్పందిస్తున్నారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు కోడూరు సుధాకర్ కృషి చేస్తున్నారని చెప్పారు. తమ పాఠశాలలోని సాంఘిక శాస్త్ర ప్రయోగశాల కోసం వంద మంది జాతీయ నాయకుల చిత్ర పటాలను సుధాకర్ అందివ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కోడూరి సుధాకర్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడానికి ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైందన్నారు. విద్యార్థులు సామాజిక అంశాల పట్ల స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. సమకాలీన అంశాలపై సమగ్ర సమాచారాన్ని అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా రూపొందించి సమాజాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పూర్ణ చందర్ రావు మాట్లాడుతూ నేటి కాలంలో సాంఘిక శాస్త్రం ఆవశ్యకత గణనీయంగా పెరిగిందన్నారు. సాంఘిక శాస్త్ర బోధన ద్వారా సామరస్య, సహన పూరిత, ఆదర్శ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేటు విద్యాసంస్థల్లో సాంఘిక శాస్త్ర బోధనను నిర్లక్ష్యం చేయడం వల్ల సమాజంలో సామాజిక స్పృహ తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. పాఠశాలకు ఆదర్శ నాయకుల చిత్ర పటాలను అందించిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోడూరి సుధాకర్ ను సన్మానించారు.



రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 20: రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం "అరైవ్, అలైవ్" నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క (దానసరి అనసూయ) పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "Arrive, Alive" కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క (దానసరి అనసూయ) హెల్మెట్ నమూనాను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కొత్త హెల్మెట్ నమూనా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో పాటు, సౌకర్యవంతంగా, తేలికగా రూపొందించబడిందని తెలిపారు. యువతతో పాటు అన్ని వయస్సుల వారు హెల్మెట్ ను నిత్యం వినియోగించేలా అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే "Arrive, Alive" కార్యక్రమం ద్వారా ప్రజల్లో భద్రతా స్పృహను పెంచుతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ శెట్కార్, సంబంధిత అధికారులు, రవాణా శాఖ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రూ.31.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 20: సంగారెడ్డి మున్సిపాలిటీలో రూ.31.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపన చేశారు. సంగారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ పార్క్, రాజంపేట రోడ్డు తదితర ప్రధాన అభివృద్ధి పనులకు అధికారికంగా ప్రారంభం పలికారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు నేతలు



తెలిపారు.టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తయ్యేలా తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. అలా జరిగితే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

- మంత్రి సీతక్క
- గ్రామాలకు సేవ చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గ్రామాలను ఎంపిక చేయాలి
- నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 20: గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి సర్పంచ్ పని చేయాలని పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్రమంత్రి సీతక్క అన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణకార్యక్రమంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ప్రజాస్వామ్యానికి పునాది లాంటివని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని తెలిపారు. త్రాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రజలతో నిరంతరం సమన్వయం తో పారదర్శకంగా పాలన సాగించాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి దిశగా సమర్థవంతంగా సేవలందించి, జిల్లాలోని గ్రామాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గ్రామాభివృద్ధి సంబంధిత కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పరిశుభ్రత, త్రాగునీరు, పచ్చదనం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టే పనులన్నీ నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



చదువు అన్నింటి కంటే శక్తివంతమైనది

- శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి
- నేతి కైలాసం, అధ్యక్షుడు, సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం

ప్రతిపక్షం,చిన్నకోడూరు, జనవరి 20: చదువు ఒక్కటే అన్నిటి కంటే శక్తి వంతమని సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరై శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.15 వేలతో ఐడి కార్డులు, టై, బెల్టులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న చేయూతకు తోడు దాతలు చేస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బడికి బలవంతంగా రావద్దని, ఇష్టంతో రావాలన్నారు. రామంచ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో కనబడుతున్నారని, ఇలానే ముందుకు సాగాలని చెప్పారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట సురేశ్ కుమార్, ఉపాధ్యాయులు సునీత, అబేదా బేగం, వరప్రసాద్, యాదయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ప్రతిపక్షం తెలుగు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 20: వరంగల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సద్వాల సమ్మయ్య చేతుల మీదుగా ప్రతిపక్షం తెలుగు దినపత్రికను ఘనంగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమలో రౌతు రమేష్ - దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మల్లం రాజ్ కుమార్ మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీరాష్ట్రప్రధాన కార్యదర్శిపాడుగుల నరసయ్య మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ హనుమకొండ జిల్లాప్రధానకార్యదర్శి వెంకట్ రెడ్డితదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతిపక్షం తెలుగు దినపత్రిక ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజంలో న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం ప్రజాస్వామ్య భావజాలాన్ని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా వారు అభివర్ణించారు.



తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీర కాయల తిరుపతి

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 20: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నంగునూరు మండలం రాజగోపాల్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బీర కాయల తిరుపతి ఎన్నికయ్యారు. హైదరాబాదులోని నారాయణగూడ కేషవ మెమోరియల్ పాఠశాలలో జరిగిన తపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీరకాయల తిరుపతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో యూనియన్ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడతానని తెలిపారు.

మధ్యాహ్న భోజనం విషయంలో రాజీ పడవద్దు

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 20: మండల పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదికి వెళ్ళి ఆహార పదార్థాలు బీరకాయ పప్పు, సాంబారులను పరిశీలించారు. రోజు కామన్ డైట్ మెను పాటించాలని విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించి భోజనం బాగుంటుందా, సెలబస్ ఎంత వరకు వచ్చింది, చదువు ఎలా సాగుతుందని విద్యార్థులను అడగ్గ తమరు పాఠశాలను పర్యవేక్షణ చేస్తున్నప్పటినుండి నుండి మెరుగైందని, సిలబస్ సగం కంటే ఎక్కువ అయిందని విద్యార్థులు తెలిపారు. ఒక ఉన్నతమైన లక్ష్యం పెట్టుకుని సమయం వృధా చేయకుండా బాగా చదవాలని కలెక్టర్




తెలిపారు. పాఠశాలలోని కిచెన్ గార్డెన్ లో పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బంది నీ ఆదేశించారు. విద్యార్థులకు చదువు, మధ్యాహ్న భోజనం విషయంలో రాజి పడవద్దని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, జనవరి 20 హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష హసన్ పర్తి ఈటిసిలో సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులు తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని టిటిడిసిలో ఉన్న విస్తరణ శిక్షణ కేంద్రం (ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ఈ టి సి)లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అధికారాలు,విధులు,బాధ్యతలు,పరిమితులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం కొనసాగుతుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల 19 నుండి 23వ తేదీ వరకు జిల్లాలోని ఐదు మండలాలైన భీమదేవరపల్లి, కమలాపూర్, నడికూడ, ఆత్మకూరు,శాయంపేట మండలాలకు చెందిన 103మంది సర్పంచులకు గ్రామ పంచాయతీల నిర్వహణలో సర్పంచుల విధులు, బాధ్యతలు, తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న సర్పంచ్ లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాలను అభివృద్ధిలో ముందు నిలిపి మంచి పేరును తీసుకురావాలన్నారు. సంబంధిత గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై సర్పంచులు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా సర్పం



చులు తమ విధులు బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులు పనిచేయాలన్నారు. గ్రామాలను స్వచ్ఛ తెలంగాణ దిశగా కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి రూపురేఖలు సర్పంచులతో సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఈటీసీ ప్రిన్సిపల్ కౌసల్యదేవి, డీఎల్పీవోలు రవిబాబు, గంగా భవాని, ఎంపీడీవోలు రామకృష్ణ, అనిల్ కుమార్, ఎంపీవోలు రంగా చారి,చేతన్ కుమార్, రంజిత్, యోగితా, మార్గవి, ఐఈసీ కో ఆర్డినేటర్ సంపత్ కుమార్, తదితరులతో పాటు సర్పంచ్ లు పాల్గొన్నారు.



ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్నబాధ్యులు ఎవరో తేల్చకుండా సీఎం రేవంత్ రెండేళ్లుగా దర్యాప్తు పేరిట కాలయాపన చేశారు. ప్రజల దృష్టి మళ్లించడానికి ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ట్యాపింగ్‌కు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్యాపింగ్‌పై కవిత చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి. కలహాలతో బీఆర్ఎస్ ముక్కలవుతుంది.

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు షాక్..



ముంబయి పేలుళ్ల ఘటన (1993)లో కీలక పాత్రధారి అబూసలేం పై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. తన సోదరుడి మరణం నేపథ్యంలో 14 రోజుల పెరోల్ కోరుతూ బాంబే హైకోర్టులో అబూ సలేం పిటిషన్ వేశాడు. దానిని వ్యతిరేకిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ గ్యాంగ్‌స్టర్‌కు పెరోల్ ఇస్తే పారిపోతాడని తెలిపింది. 1993లో పోర్చుగల్‌కు పారిపోయిన అంశాన్ని గుర్తు చేసింది. అవసరం అయితే రెండు రోజుల పెరోల్ ఇవ్వొచ్చని సూచించింది.అబూ సలేం ఒక అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ అని, దశాబ్దాల పాటు నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడని మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తన సోదరుడి కుటుంబం ఉంటున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరాయ్మిర్ ప్రాంతానికి వెళ్లాలని అతడు తన పిటిషన్‌లో కోరడంపై యూపీ పోలీసులు కూడా ప్రతికూలంగా స్పందించారు. అది మతపరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో అక్కడికి వెళ్లడం ప్రమాదకరమన్నారు. పేలుళ్ల ఘటనకు పాల్పడిన అబూసలేం నకిలీ పాస్‌పోర్ట్‌తో పోర్చుగల్‌కు పారిపోయాడు. అక్కడ పోలీసులు అరెస్టు చేయడంతో అతని జాడ వెల్లడయింది. అనంతరం భారత అధికారుల అభ్యర్థన మేరకు అతడికి మరణ శిక్ష విధించరాదని, 25 ఏళ్లకు ఎక్కువ జైలు శిక్ష విధించవద్దనే షరతులతో అతడిని 2005లో భారత్‌కు అప్పగించారు. పేలుళ్లు, బెదిరింపులు, హత్య కేసుల్లో 2015లో అతడికి జీవిత ఖైదు పడింది. నాటి నుంచి మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

విశ్వ వీక్షణం



జవాబుదారీతనం ఎక్కడ?

ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలో నీటిగుంతలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యువరాజ్ మెహతా మరణించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. ఇటీవల ఇండోర్‌లో చోటుచేసుకున్న కలుషిత నీటి మరణాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరైన జవాబుదారీతనం లేకపోవడంవల్లే దేశంలో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ''రోడ్లు (నోయిడా ఘటనను ఉద్దేశిస్తూ).. నీళ్లు (ఇండోర్ ఘటన).. అగ్నిప్రమాదాలు (గోవా ఘటన) ప్రాణాలు తీస్తున్నాయి. వంతెనలు, కాలుష్యం, అవినీతి.. ఇలా అనేక కారణాలతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. పట్టణాల్లో ఇలాంటి ఘటనలకు నిధులు, సాంకేతికత, పరిష్కారం లేకపోవడం కారణం కాదు. సరైన సమయంలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడమే అసలైన సమస్య. ప్రభుత్వ పట్టింపు లేని చర్యలే ఈ మరణాలకు కారణం'' అని మండిపడ్డారు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోన్న యువరాజ్ గతవారం విధులు ముగించుకొని ఇంటికి తిరిగొస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నోయిడాలోని సెక్టార్ 150లోని ఏటీఎస్ లే గ్రాండియోస్ కూడలి వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి మురుగుకాలువ గోడను ఢీకొట్టి పక్కనే ఉన్న నీటి గుంతలో పడింది. ఊపిరాడక ఆ టెకీ ప్రాణాలు కోల్పోయారు. ఈ నీటి గుంత గురించి గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపించారు.



దావోస్‌లో ట్రంప్ విందు..

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు స్విట్జర్లాండ్‌లోని దావోస్ చేరుకుంటున్నారు. ఇందులో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరేళ్ల తర్వాత వస్తున్నారు. ఈ సందర్భంగా ట్రంప్ ఏర్పాటు చేసే విందుకు ఏడుగురు భారతీయ సీఈవోలకు ఆహ్వానం అందినట్లు సమాచారం.టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిత్తల్, విప్రో సీఈవో శ్రీని పల్లియా, ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ ఎస్.పరేఖ్, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్, మహీంద్రా గ్రూపు సీఈవో అనీశ్ షా, జూబిలెంట్ భర్తియా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు హరి ఎస్.భర్తియాలు హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల నుంచి 3వేలకు పైగా ప్రతినిధులు రానున్నారు. అనేక దేశాలపై సుంకాలు విధిస్తుండటం, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా పలు చోట్ల ఘర్షణపూరిత వాతావరణం నెలకొన్న తరుణంలో ట్రంప్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



గ్రీన్‌లాండ్‌పై అమెరికా గురి


గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది.అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ ' తాజాగా గ్రీన్‌లాండ్‌కు సంబంధించి తమ సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు.ఇక, అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు సోమవారం గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ఆశలను ఉద్దేశిస్తూ.. ఫ్రాన్స్ బహిరంగ విమర్శలు చేసింది. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు దృష్టిసారించారనే దానిపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భవిష్యత్తులో రష్యా నుంచి వచ్చే ముప్పు నుంచి కాపాడుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేసింది. 'ఏదోఒక రోజు మంటలు చెలరేగితే.. అగ్నిమాపక సిబ్బంది రావాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడే ఇంటిని తగలబెట్టేయడం మంచిది. ఏదో ఒకరోజు కారుకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి ఇప్పుడే కారుకు యాక్సిడెంట్ చేయడం మంచిది'' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది.ఇక, గ్రీన్‌లాండ్ సాధించుకునేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలపై ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్కూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు ఈయూ, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య, ఆర్థిక సంబంధాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.



బరువు పెరగడం అంటే.. ఆయువు తగ్గడమే!



ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం... స్థూలకాయం అనేది కేవలం శరీర బరువు పెరగడం మాత్రమే కాదు.. ఇది ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఒక భయంకరమైన మహమ్మారిగా మారింది. అదృశ్య శత్రువులా జీవితంలోకి చొరబడి.. నెమ్మదిగా ఆరోగ్యాన్ని హరించి, మరణం అంచులకు నెట్టేస్తున్న ఈ సమస్య తీవ్రతను చాలా మంది గుర్తించడం లేదు. స్థూలకాయం కారణంగా ఏటా సుమారు 2.8 మిలియన్ల మంది మరణిస్తున్నారని WHO వెల్లడించింది. అంతేకాదు.. ఇది 13 రకాల క్యాన్సర్‌లతో సహా అనేక తీవ్రమైన దీర్ఘకాలిక వ్యాధులకు మూలకారణంగా మారుతోంది. ఈ సమస్య ఎంత ప్రమాదకరమైనదో.. ఇది ఎలా విస్తరిస్తుందో.. దీనికి గల కారణాలు, నివారణ మార్గాల గురించి కొన్ని విషయాలు ఈ ఆర్టికల్‌లో తెలుసుకుందాం.



భయంకరమైన సవాలు:

స్థూలకాయం ఎంత వేగంగా పెరుగుతుందంటే.. WHO దీనిని ఒక ఎపిడెమిక్గా పరిగణిస్తోంది. 1990 నుంచి 2022 వరకు.. వయోజనులలో స్థూలకాయం రెట్టింపు కంటే ఎక్కువైంది. 2022 నాటికి.. ప్రపంచవ్యాప్తంగా సుమారు 880 మిలియన్ల వయోజనులు, 160 మిలియన్ల మంది పిల్లలు స్థూలకాయంతో బాధపడుతున్నారు. ప్రపంచంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు స్థూలకాయంతో బాధపడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి.

భారతదేశంలో పరిస్థితి:

భారతదేశంలో కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఓ అధ్యయనం ప్రకారం.. 2022 నాటికి భారతదేశంలో సుమారు 12.5 మిలియన్ల మంది పిల్లలు, కౌమారదశలో ఉన్నవారు స్థూలకాయులయ్యారు. సరైన చర్యలు తీసుకోకపోతే.. 2030 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగి 27 మిలియన్లకు చేరే ప్రమాదం ఉంది. శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోయి.. ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపడాన్ని స్థూలకాయం అంటారు. దీనిని లెక్కించడానికి సులభమైన మార్గం బాడీ మాస్ ఇండెక్స్ (BMI). ఇది ఒక వ్యక్తి బరువుకు, ఎత్తు మధ్య నిష్పత్తిని లెక్కిస్తుంది. WHO అభిప్రాయం ప్రకారం.. కేవలం BMI మాత్రమే కాకుండా.. పొట్ట చుట్టూ, కాలేయం, గుండెలో పేరుకుపోయిన కొవ్వు మరింత ప్రమాదకరమైనదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో... స్థూలకాయాన్ని క్లినికల్ స్థూలకాయం ప్రీక్లినికల్ స్థూలకాయం అనే రెండు దశలుగా విభజించి చికిత్స అందించాలని సిఫార్సు చేస్తున్నారు. స్థూలకాయం అనేది ఒక్క రోజులో వచ్చే సమస్య కాదు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, నిద్ర లేమి, ఒత్తిడి వంటి అనేక అంశాల కలయిక దీనికి కారణం.

జంక్ ఫుడ్ విప్లవం:

పిజ్జా, బర్గర్‌లు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ వంటి అల్ట్రాప్రాసెస్డ్ ఆహారం ఒక్కసారిగా 5001000 కేలరీలను అందిస్తోంది. భారతదేశంలో గత 15 సంవత్సరాలలో ఈ మార్కెట్ 40 రెట్లు పెరిగింది. భారతీయుడు రోజుకు 810 గంటలు కూర్చునే ఉంటున్నాడు. పని, ఫోన్ వాడకం, టీవీ చూడటం వంటివి కేలరీలను బర్న్ చేయకుండా నిరోధిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల నివాసితులలో 70% మంది రోజుకు 5,000 అడుగులు కూడా నడవడం లేదు. ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయే వారికి స్థూలకాయం వచ్చే ప్రమాదం 55% ఎక్కువ. నిద్ర లేమి వలన కార్టిసోల్ అనే ఒత్తిడి హార్మోన్ పెరుగుతుంది, ఇది బొడ్డు చుట్టూ కొవ్వును పెంచుతుంది. ఒత్తిడికి గురైనప్పుడు ఎమోషనల్ ఈటింగ్ కూడా కొవ్వు నిల్వకు కారణమవుతుంది. కొన్ని రకాల డిప్రెషన్ మందులు, స్టెరాయిడ్లు, పాత మధుమేహం మందులు, జనన నియంత్రణ మాత్రలు బరువు పెరగడానికి దోహదపడతాయి. తల్లిదండ్రులు స్థూలకాయులైతే, పిల్లలకు కూడా స్థూలకాయం వచ్చే అవకాశం 70% వరకు ఉంటుంది. అయితే.. నేటి ఆహారపు అలవాట్లు, నిశ్చల జీవనం ఆ జన్యువును ఆన్ చేస్తోంది.

స్థూలకాయం వలన పెరిగే వ్యాధుల ప్రమాదం:

స్థూలకాయం అనేది అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ప్రవేశ ద్వారం. ఇది ఒకేసారి శరీరంలోని అనేక వ్యవస్థలను దెబ్బతీస్తుంది. స్థూలకాయం చెడు కొలెస్ట్రాల్ను పెంచి, మంచి కొలెస్ట్రాల్ను తగ్గిస్తుంది. 3040 ఏళ్లలోపు వారిలో గుండెపోటుకు పొగతాగడం తరువాత స్థూలకాయం అతిపెద్ద ప్రమాద కారకంగా మారుతోంది. అధిక పొత్తికడుపు కొవ్వు రక్తపోటును 34 రెట్లు వేగంగా పెంచుతుంది. టైప్ 2 మధుమేహం కేసులలో 9095% స్థూలకాయం వల్లే సంభవిస్తున్నాయి. ప్రతి 10 కిలోల అదనపు బరువు మధుమేహం వచ్చే ప్రమాదాన్ని 45 రెట్లు పెంచుతుంది. స్థూలకాయం రొమ్ము, పెద్దప్రేగు, గర్భాశయం, కాలేయం, మూత్రపిండాలు, క్లోమం, థైరాయిడ్ వంటి 13 రకాల క్యాన్సర్లకు ప్రత్యక్ష కారణమని WHO ధృవీకరించింది. స్థూలకాయం పురుషులలో శుక్రకణాల సంఖ్యను 3040% తగ్గిస్తుంది. మహిళల్లో అండోత్పత్తిని ఆపుతుంది, PCOS/PCOD వంటి సమస్యలకు కారణమవుతుంది. PCOS ఉన్న ప్రతి నలుగురు అమ్మాయిలలో ముగ్గురు అధిక బరువు లేదా స్థూలకాయంతో బాధపడుతున్నారు. అయితే స్థూలకాయం ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరు నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్తో బాధపడుతున్నారు. గతంలో మద్యపానం చేసేవారికి మాత్రమే వచ్చే ఈ సమస్య.. ఇప్పుడు భారతదేశంలో 2530% మందిని ప్రభావితం చేస్తోంది.

నివారణ-చికిత్స:

స్థూలకాయం ప్రమాదకరమైనది అయినప్పటికీ.. సరైన జీవనశైలి మార్పులు, వైద్య చికిత్సతో దీనిని నియంత్రించవచ్చు. జంక్ ఫుడ్‌ను పూర్తిగా మానేసి, సంప్రదాయ ఆహారం, పండ్లు, కూరగాయలు, తక్కువ కేలరీలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. చక్కెర పానీయాలకు బదులుగా నీరు లేదా ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకోవాలి. రోజుకు కనీసం 3060 నిమిషాల పాటు వేగంగా నడవడం లేదా మితమైన వ్యాయామం చేయడం ద్వారా కేలరీలను బర్న్ చేయాలి. రోజుకు 5,000 అడుగులు నడవాలనే లక్ష్యాన్ని పెట్టుకోవాలి. రోజుకు 78 గంటల నిద్ర తప్పనిసరి. యోగా, ధ్యానం లేదా ఇతర ఒత్తిడి ఉపశమన పద్ధతుల ద్వారా కార్టిసోల్ స్థాయిలను తగ్గించుకోవాలి. BMI 30 దాటిన వారు వైద్యుడిని సంప్రదించాలి. తీవ్రమైన కేసుల్లో బారియాట్రిక్ సర్జరీ వంటి శస్త్రచికిత్స పద్ధతులను వైద్యులు సిఫార్సు చేయవచ్చు.

స్థూలకాయం ఆర్థిక భారం:

స్థూలకాయం వలన కలిగే ఆరోగ్య సమస్యలకు చికిత్స కోసం భారతదేశం ఏటా భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తోంది. స్థూలకాయం, దాని అనుబంధ వ్యాధులపై ప్రత్యక్ష, పరోక్ష ఖర్చులు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయి. ఈ సమస్యలను నివారించడం ద్వారా ఆరోగ్యాన్ని, అలాగే దేశ ఆర్థిక వ్యవస్థను కూడా రక్షించుకోవచ్చు. స్థూలకాయాన్ని ఒక అదృశ్య మారణాయుధంగా గుర్తించి.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా మాత్రమే మనం ఈ మహమ్మారిని ఎదుర్కోగలమని నిపుణులు చెబుతున్నారు.



ముంబయిని చిత్తు చేసిన ఢిల్లీ

మహిళల ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది. మిగతా రెండు స్థానాల కోసం నాలుగు జట్లు బరిలో నిలిచాయి. ఇలాంటి సమయంలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ హాఫ్ సెంచరీతో అదరగొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో దిల్లీ 19 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లను మాత్రమే కోల్పోయి 155 పరుగులు చేసి విజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (51*)తోపాటు లిజెల్లె లీ (46) కీలక పాత్ర పోషించారు. జెమీమా *ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.ముంబయి నిర్దేశించిన 155 పరుగుల లక్ష్య ఛేదనలో దిల్లీకి శుభారంభం దక్కింది. మొదటి వికెట్‌కు షఫాలీ వర్మ (29)తో కలిసి లీ అర్ధశతక భాగస్వామ్యం (63 పరుగులు) నిర్మించింది. దూకుడుగా ఆడిన షఫాలీ ఔటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన లారా వాల్వర్ట్ (17)తో కలిసి లీ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. అయితే, హాఫ్ సెంచరీకి చేరువగా వచ్చిన లీని అమన్‌జోత్ కౌర్ ఔట్ చేసింది. లెగ్‌సైడ్ పడిన బంతిని ఆడే క్రమంలో లీ స్టంపౌట్ రూపంలో పెవిలియన్‌కు చేరింది. అయితే, థర్డ్ అంపైర్ తీసుకున్న ఈ నిర్ణయం సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారింది. లీ కూడా తీవ్ర అసంతృప్తితో పెవిలియన్ బాట పట్టింది. స్వల్ప వ్యవధిలోనే ఓపెనర్లతోపాటు లారా ఔటైనా.. మరో ఎండ్‌లో జెమీమా మాత్రం క్రీజ్‌లో పాతుకుపోయింది. కాప్ (10*), జెమీమా మరో వికెట్ పడనీయకుండా జట్టును విజయతీరాలకు చేర్చారు. 19వ ఓవర్ చివరి బంతిని కాప్ సిక్స్‌గా మలిచింది. ఈ క్రమంలో జెమీమా డబ్ల్యూపీఎల్‌లో నాలుగో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. ముంబయి బౌలర్లలో అమన్‌జోత్, వైష్ణవి శర్మ చెరో వికెట్ తీశారు.
అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఇండియన్స్ 21 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. సజీవన్ సజనా (9), హేలీ మాథ్యూస్ (12) త్వరగా ఔటయ్యారు. అయినా సరే జట్టు స్కోరు 150+ పరుగులు దాటాయంటే దానికి కారణం కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (41), నాట్ స్కివర్ బ్రంట్ (65*). వీరిద్దరూ మూడో వికెట్‌కు 58 బంతుల్లో 78 పరుగులు జోడించారు. హర్మన్ హాఫ్ సెంచరీ చేజార్చుకున్నప్పటికీ.. బ్రంట్ మాత్రం చివరి వరకూ క్రీజ్‌లో ఉండి జట్టుకు మెరుగైన స్కోరు అందించింది. ఆఖర్లో నికోలా కేరీ (12), సంస్కృతి గుప్తా (10*) తమ బ్యాట్‌ను ఝుళిపించారు. దిల్లీ బౌలర్లలో శ్రీ చరణి 3.. కాప్, నందని శర్మ చెరో వికెట్ తీశారు.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

తగ్గనున్న రోహిత్, కోహ్లీ పేమెంట్



భారత క్రికెట్ నియంత్రణ మండలి కొత్త తరహా కాంట్రాక్టు వ్యవస్థను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. క్రికెటర్లతో కుదుర్చుకునే ఆ ఒప్పందంలో కీలక మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఏ ప్లస్ కేటగిరీని ఎత్తివేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఆ కొత్త తరహా కాంట్రాక్టు మోడల్‌కు ఆమోదం దక్కితే .. టీమిండియా సీనియర్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు భారీ నష్టం జరిగే అవకాశం ఉన్నది. ఆ ఇద్దరు సీనియర్లను ఇక నుంచి గ్రేడ్ బీ కేటగిరీలో పొందుపరిచే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ వర్గాల ద్వారా తెలుస్తోంది.కొత్త తరహా సెంట్రల్ కాంట్రాక్టు విధానాన్ని అజిత్ అగార్కర్ నేతృత్వంలో రూపొందించినట్లు తెలుస్తోంది. ఏ ప్లస్ కేటగిరీని రద్దు చేయాలని ఆ కమిటీ సూచించినట్లు స్పష్టం అవుతున్నది. ఆ కేటగిరీలో కాంట్రాక్టు కింద ఏడు కోట్లు ఇస్తారు. అయితే కొత్త ప్లాన్‌లో కేవలం మూడు కేటగిరీలను మాత్రమే ఉంచనున్నారు. ఏ, బీ, సీ మాత్రమే ఉంటాయని తెలుస్తోంది. అయితే ఈ కొత్త మోడల్‌కు బీసీసీఐ ఆమోదం చెబుతుందా లేదా అన్న విషయం తెలిసిందే.ఇక కొత్త మోడల్ వల్ల కోహ్లీ, రోహిత్ పేమెంట్‌లో 57 శాతం కోత ఉండే అవకాశం ఉన్నది. ఈ ఇద్దరూ కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న కారణంగా వాళ్లు ఏ కేటగిరీలో ఉండే అవకాశం లేదని అర్థమవుతోంది. ఆ సీనియర్ క్రికెటర్లు ఇక బీ కేటగిరీలో ఉండనున్నారు.బీ కేటగిరీలో కేవలం మూడు కోట్లు మాత్రమే పేమెంట్ ఇస్తారు. దీని వల్ల వాళ్లు వార్షికంగా నాలుగు కోట్లు కోల్పోనున్నారు.



మేం టీ20 ప్రపంచ కప్ బహిష్కరించం: పాకిస్థాన్

భారత్‌లో 2026 టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ బెట్టు చేస్తోన్న సంగతి తెలిసిందే. భద్రత కారణాలు, జాతీయ గౌరవాన్ని సాకుగా చూపుతూ కోల్‌కతా, ముంబయిలలో జరగాల్సిన తమ మ్యాచ్‌ల కోసం భారత్‌కు వచ్చేందుకు నిరాకరిస్తోంది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా పాకిస్థాన్ కూడా ప్రపంచ కప్ మ్యాచ్‌లను బహిష్కరించాలని యోచిస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై పాకిస్థాన్ తాజాగా స్పందించింది. అవన్నీ ఊహాగానాలేనని స్పష్టం చేసింది. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ మ్యాచ్‌లు ఆడొద్దని నిర్ణయించుకున్నా తాము టోర్నమెంట్‌ను బహిష్కరించబోమని వెల్లడించింది. '2025 ఆరంభంలో జరిగిన ఒప్పందం ప్రకారం మా మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో షెడ్యూల్ చేశారు. మేం టోర్నీ నుంచి ఎందుకు వైదొలగాలి? వివాదాన్ని మరింత పెద్దది చేయడానికి కొందరు ఇలాంటి విషయాలను తెరపైకి తెస్తున్నారు' అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వర్గాలు ఓ క్రీడా వెబ్‌సైట్‌కు వెల్లడించాయి. భారత్‌లో పర్యటించేందుకు బంగ్లా నిరాకరిస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ (ICC) భావిస్తున్నట్లు వార్తలొచ్చాయి. కానీ, ఈ విషయం గురించి ఐసీసీ తమకు అధికారిక సమాచారం అందించలేదని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అన్నారు. 'ఒత్తిడి చేసి మమ్మల్ని భారత్‌లో మ్యాచ్‌లు ఆడించలేరు. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడిస్తామని ఐసీసీ మాకు అధికారికంగా సమాచారం ఇవ్వలేదు.' అని నజ్రుల్ వివరించారు. మరోవైపు, ఐసీసీ తమతో ఇప్పటివరకు ఎలాంటి సంప్రదింపులు జరపలేదని స్కాట్లాండ్ పేర్కొంది.

బ్యాడ్మింటన్‌కు వీడ్కోలు పలికిన సైనా



భారత మహిళల బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ సంచలన ప్రకటన చేశారు. బ్యాడ్మింటన్ ఆటకు వీడ్కోలు పలికారు. మహిళల బ్యాడ్మింటన్‌కు మార్గదర్శిగా నిలిచి ఎన్నో అత్యుత్తమ విజయాలు అందుకున్న సైనా.. తాను ఇక ఆడలేనని ఓ పాడ్‌కాస్ట్ వేదికగా తెలిపారు.'నేను రెండేళ్ల కిందటే ఆడటం ఆపేశాను. ఎంతో ఇష్టంతోనా అంతట నేను ఆటలోకి వచ్చా. ఇప్పుడు నా అంతట నేను నిష్క్రమిస్తున్నా. ఇంకెంత మాత్రం ఆడగలిగే సామర్థ్యం లేనప్పుడు కథ ముగిసినట్లే. ఇది సహజం. నా రిటైర్మెంట్‌ను ప్రకటించడం అంత పెద్ద విషయమని నేను అనుకోలేదు. అందుకే చెప్పలేదు. ఆటకు గుడ్‌బై చెప్పే సమయం ఇదే అని నాకు అనిపించింది. ఎందుకంటే మునుపటిలా నా మోకాళ్లు సహకరించడం లేదు.ఆర్థరైటిస్ వచ్చింది.. కార్టిలేజ్ పూర్తిగా డ్యామేజ్ అయింది. గతంలోలాగా ఎక్కువ సమయం తీవ్రమైన శిక్షణను తట్టుకోలేకపోయాను. అందుకే ఈ నిర్ణయం తప్పనిసరి అయింది. ఇక నేను ఆ స్థాయిలో ఆడలేనని నా తల్లిదండ్రులు, కోచ్‌లకు చెప్పాల్సి వచ్చింది. చాలా కష్టంగా ఉందని చెప్పాను. ఇంతకు ముందు రోజుకు 8 నుంచి 9 గంటలు శిక్షణ తీసుకునేదాన్ని. ఇప్పుడు గంట, రెండు గంటల్లోనే మోకాలు వాపు వచ్చేస్తోంది. అప్పుడు అనిపించింది.. ఇక చాలు. ఇంతకంటే నేను కష్టపడలేను అని. అందుకే ఆటకు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నాను' అని సైనా చెప్పుకొచ్చింది.



ఎన్టీఆర్-నీల్ చిత్రానికి చిన్న బ్రేక్..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఓ భారీ ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని ప్రకటించిన దగ్గరనుండి ఈ సినిమాపై ప్రేక్షకులతో పాటు సినీ వర్గాల్లో అదిరిపోయే అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కాగా, తాజాగా ఈ చిత్ర షూటింగ్‌కు ఓ చిన్న బ్రేక్ వచ్చినట్లు తెలుస్తోంది.ఈ బ్రేక్‌కు కారణం హీరో ఎన్టీఆర్ అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఎన్టీఆర్ కాస్త జలుబుతో బాధపడుతున్నాడని.. అందుకే ప్రశాంత్ నీల్ చిత్ర షూటింగ్‌కు చిన్న బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఈ తాజా షెడ్యూల్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతుండగా రాత్రి సమయంలో ఈ షూటింగ్ నిర్వహిస్తున్నారట. ఇక ఈ సినిమా షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నారట.తొలుత 2026 జనవరి 26న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని ప్రకటించినా, ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారట. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ అనిల్ కపూర్ ఓ కీలక పాత్రలో నటిస్తుండగా అందాల భామ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

బుట్టబొమ్మ కమ్ బ్యాక్




బుట్ట బొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్ కి దూరమైంది. రెండేళ్ల క్రితం వరకు తెలుగులో స్టార్ హీరోలు హీరోయిన్ గా మొదటి ఆప్షన్ గా పూజా హెగ్డేని ఎంపిక చేసుకునే వారు. దర్శక నిర్మాతలు కూడా పూజా హెగ్డే సినిమాలో ఉంటే గ్లామర్ పరంగా కలిసి వస్తుందని అనుకునే వారు. కానీ ఎప్పుడైతే రాధే శ్యాం పోయిందో అప్పటికే ఆమె గ్రాఫ్ పడిపోతూ రాగా ఆ తర్వాత గుంటూరు కారం సినిమా నుంచి ఆమె ఎగ్జిట్ అవ్వడం టాలీవుడ్ ని మరింత దూరం చేసుకుంది.గుంటూరు కారం సినిమాలో పూజా హెగ్డే చేస్తే ఎలా ఉండేదో కానీ ఆమె చేయాల్సిన రోల్ ని శ్రీలీల చేసింది. ఐతే తెలుగు ఆడియన్స్ బుట్ట బొమని బాగా మిస్ అవుతున్నారు. అఫ్కోర్స్ రేసులోకి కొత్త హీరోయిన్స్ వచ్చారు. ఆల్రెడీ రష్మిక సూపర్ ఫాం కొనసాగిస్తుంది. శ్రీలీల, భాగ్య శ్రీ ఇలా కొత్త హీరోయిన్స్ తమ టాలెంట్ చూపిస్తున్నారు. అయినా కూడా పూజా హెగ్డేకి ఛాన్స్ ఇవ్వాల్సిందే అన్నది తెలుగు ఆడియన్స్ కామెంట్. తెలుగు సినిమాలతోనే బాలీవుడ్ లో పాపులారిటీ తెచ్చుకుంది పూజా హెగ్డే. హిందీలో ఆమెకు పెద్దగా క్రేజ్ రాలేదు. ఎప్పుడైతే టాలీవుడ్ లో స్టార్ స్టేటస్ దక్కించుకుందో అప్పుడు హిందీలో కూడా అలాంటి అవకాశాలే వచ్చాయి. టాలీవుడ్ కాదు కానీ కోలీవుడ్ లో పూజా హెగ్డేకి అవకాశాలు వస్తున్నాయి. సూర్యతో రెట్రో చేసిన ఈ బ్యూటీ జన నాయగన్ లో నటించింది.లారెన్స్ చేస్తున్న కాంచన 4లో కూడా పూజా హెగ్డే ఛాన్స్ అందుకుంది. ఐతే తమిళ, హిందీ సినిమాలు ఓకే కానీ పూజా బేబ్ టాలీవుడ్ ఛాన్స్ ల కోసం ఆమె ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే దుల్కర్ సల్మాన్ నెక్స్ట్ సినిమాలో అమ్మడు లక్కీ ఛాన్స్ అందుకుంది. రవి అనే నూతన డైరెక్టర్ చేస్తున్న సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు అమ్మడు భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేసిందని టాక్.అవకాశాలు రాకపోయినా డిమాండ్ విషయంలో పూజా హెగ్డే ఎక్కడ తగ్గట్లేదు. మరి దుల్కర్ సినిమాతో పాటు తెలుగులో మరికొన్ని ఛాన్స్ లు ఏవైనా అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. పూజా బేబ్ గ్లామర్ షో కోసం ఆమె ఫ్యాన్స్ ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారు. తెలుగు మేకర్స్ ఆమెకు మరో అవకాశాన్ని ఇవ్వాలని వాళ్లు రిక్వెస్ట్ చేస్తున్నారు. దుల్కర్ సల్మాన్ తో టాలీవుడ్ ఛాన్స్ అందుకున్న పూజా హెగ్దే మళ్లీ ఇక్కడ హిట్ ఫాం కొనసాగిస్తుందేమో చూడాలి. బాలీవుడ్ కన్నా సౌత్ సినిమాల మీదే ఎక్కువ ప్రేమ చూపిస్తున్న పూజా హెగ్డేకి మళ్లీ తన స్టార్ ఫాం రోజులు తిరిగి రావాలని ఫ్యాన్స్ కోరుతున్నారు.

కింగ్ నాగార్జున 'డబుల్' ధమాకా



నా సామిరంగ సక్సెస్ తర్వాత కింగ్ నాగార్జున సోలో సినిమా విషయంలో కాస్త ముందు వెనకగా ఉండగా ఈ గ్యాప్ లో లాస్ట్ ఇయర్ ధనుష్ తో కుబేర, రజనీకాంత్ తో కూలీ సినిమాలు చేశాడు. ఆ సినిమాల్లో నాగార్జున నటించడం వల్ల ఆ మూవీస్ కి క్రేజ్ వచ్చాయి కానీ అవి చేయడం వల్ల నాగార్జునకు పెద్దగా వచ్చింది ఏమి లేదు. కుబేర, కూలీ చూసిన అక్కినేని ఫ్యాన్స్ ఇంకా హర్ట్ అయ్యారని చెప్పడంలో సందేహం లేదు. ఐతే నాగార్జున సోలో సినిమా అదే 100వ సినిమా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ సినిమా విషయంలో నాగార్జున చాలా ఆచి తూచి అడుగులు వేస్తున్నారు.ఆల్రెడీ డైరెక్టర్, స్టోరీ లాక్ అయినా కూడా అనౌన్స్ మెంట్ కోసమే ఇంత వెయిట్ చేస్తున్నారు అంటే ఆ ప్రాజెక్ట్ ని నాగార్జున ఎంత సీరియస్ గా తీసుకున్నారో అర్థమవుతుంది. 100వ సినిమా హిస్టరీలో నిలిచిపోయేలా చేయాలనే ఆలోచనతో నాగార్జున ఒక పర్ఫెక్ట్ ప్లానింగ్ తో ఉన్నారు. ఐతే ఆర్. రంజిత్ డైరెక్షన్ లో తెరకెక్కబోతున్న నాగార్జున 100వ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు ఆల్రెడీ మొదలయ్యాయట. త్వరలోనే షూటింగ్ అప్డేట్ వస్తుందని తెలుస్తుంది.ఐతే నాగార్జున 100వ సినిమానే కాదు 101వ సినిమా ప్లానింగ్స్ కూడా మొదలయ్యాయని టాక్. టాలీవుడ్ హిట్ మిషన్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఇప్పటివరకు తీసిన 9 సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. ఐతే సీనియర్ హీరోలతో కలిసి అనిల్ రావిపూడి చేస్తున్న హిట్లు తెలిసిందే. వెంకటేష్ తో 3, బాలకృష్ణతో 1, చిరంజీవితో 1 సినిమా చేశాడు అనిల్ రావిపూడి. సంక్రాంతికి ఒక సినిమా తప్పకుండా ఉండేలా చూసుకుంటున్న అనిల్ రావిపూడి ఈసారి నెక్స్ట్ నాగార్జున తోనే సినిమా అనే అంటున్నారు.నాగార్జున కూడా అనిల్ రావిపూడితో సినిమాకు రెడీ అనేస్తున్నారట. నాగార్జున 100వ సినిమా త్వరలో మొదలై దసరాకి రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. ఇక అనిల్ సినిమా కూడా ఫిక్స్ అయితే అది 2027 సంక్రాంతికి రిలీజ్ ప్లానింగ్ ఉంటుంది. సో ఈ ఇయర్ దసరా ఆ తర్వాత ఆరు నెలల్లో వచ్చే సంక్రాంతి ఇలా రెండు పెద్ద పండగలకు నాగార్జున సినిమాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నాగ్ 100వ సినిమాతో పాటే అనిల్ రావిపూడి సినిమా అనౌన్స్ మెంట్ కోసం అక్కినేని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అనిల్ రావిపూడి తో నాగార్జున సినిమా చేస్తే ఒకప్పటి నాగ్ వింటేజ్ స్టైల్ ని దించేయాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అనిల్ కూడా సీనియర్ స్టార్స్ లో మిగిలిన కింగ్ నాగార్జున తోనే సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది.



ఇళయరాజాకు పద్మపాణి పురస్కారం

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను పద్మపాణి పురస్కారం వరించింది. ఈ విషయాన్ని అజంతా ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఏఐఎఫ్ఎఫ్) నిర్వాహకులు ఇన్‌స్టా వేదికగా వెల్లడించారు. ఈ అవార్డుని ఉత్సవ ప్రారంభోత్సవంలో జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సినీ ప్రియుల సమక్షంలో ఆయనకు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ చలనచిత్రోత్సవం జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జరగనుంది. పద్మపాణి జ్ఞాపికతోపాటు ఆయనకు గౌరవ పత్రం, రూ. 2లక్షల నగదుని ప్రదానం చేస్తారు. గతంలో ఈ అవార్డును అందుకున్న వారిలో గీత రచయిత జావేద్ అక్తర్, ప్రముఖ దర్శకరచయిత సాయి పరంజ్‌పే, నటుడు ఓం పురి తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200